KSR02B142 C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 16, 2016

కథా నిలయం
శ్రీకాకుళం
ENTERED



ఉద్యోగాల రేటింగ్స్

గిన్నిస్‌లో బాలీవుడ్

ప్రపంచ చిత్ర సీమలో హాలీవుడ్ తర్వాత వినిపించే పేరు బాలీవుడ్. 100 సంవత్సరాలు పైబడిన ఈ చిత్ర సీమ ప్రయాణంలో ఎన్నో అవార్డులు రివార్డులతోపాటు కొన్ని గిన్నిస్ రికార్డులూ ఉన్నాయి. ఇటీవల వేలిగోళ్లపై పెయింటింగ్ వేసుకునే ఓ ఈ వెంట్‌లో పాల్గంది బాలీవుడ్ నటి సోనాక్షిసిన్హా. 1328 మంది పాల్గన్న ఈ పోటీలో విజేతగా గిన్నిస్ రికార్డుని దక్కించుకుంది సోనాక్షి. తుమ్ పాస్ అయే (కుఛ్ కుఛ్ హోతాహై), జబ్ సె తెరి నైనా(సావరియా), నజర్ కె సామ్‌నే (ఆషికి) లాంటి హిట్ సాంగ్స్‌ని బాలీవుడ్ చిత్రాలకందించారు ప్రముఖ గీత రచయిత సమీర్ అన్‌జాన్. 3524పైగా పాటలు రాసిన సమీర్ బాలీవుడ్‌లో దీర్ఘకాల గీత రచయితగా గిన్నిస్ రికార్డుని దక్కించుకున్నాడు. వాయిస్ బావుంటే సినీ గాయకులకి అవకాశాలు వెల్లువెత్తుతాయి. కొందరు గాయకులు రోజుకు ఆరేడు పాటల రికార్డింగ్‌లతో తెగ బిజీగా గడిపేస్తుంటారు. ఏక్ లడకీకో దేఖాతో యైసా లగా (1942 ఎ లవ్ స్టోరీ), దోదిల్ మిల్ రహే హై(పర్‌దేశ్) పాటల ఫేమ్ కుమార్ సాను ఒక్క రోజులో 28 పాటల రికార్డింగ్‌లకి హాజరై గిన్నిస్ రికార్డుని నెలకొల్పాడు. 1947లో బాలీవుడ్‌లో ప్రవేశిం చిన ఆషా దాదాపు 11 వేల సోలో పాటలతో పాటు 20 పరభాషా చిత్రాల్లో, వందలాది గీతాల్ని ఆలపించిన కళాకారిణిగా గిన్నిస్ రికార్డుని సొంతం చేసుకున్నారు. 1929లో బాలీవుడ్ చిత్రసీమకి పరియచమైన పృథ్వీ రాజ్‌కపూర్ నుండి నేటి రణ్‌బీర్ కపూర్ వరకు మెత్తం 24 మంది నటులతో గిన్నిస్ రికార్డుకెక్కింది కపూర్ ఫ్యామిలీ. 2009లో 1,288 హిందీ చిత్రాలు, 24 భాషల్లో విడుదలై ఆల్‌టైమ్ రికార్డుతోపాటు గిన్నిస్ రికార్డుని నెలకొల్పాయి. 622 కోట్ల వసూళ్లతో గిన్నిస్ అవార్డు గెలుచుకుంది పి.కె చిత్రం. వివిధ విభాగాల్లో మొత్తం 92 అవార్డులతో ఎక్కువ అవార్డులు దక్కించుకున్న చిత్రంగా కహోనాప్యార్ హై 2002లో గిన్నిస్ రికార్డుల్లో నూ పేరుదక్కించుకుంది.



KS R02B142
ENTERED
కథా నిలయం

సేవ

కులం, మతం, వర్గం, జాతి అనే బేధ భావనలు ఇప్పటికీ మనకి తారసపడూతూనే ఉన్నాయి. సమాజంలో ఇలాంటివన్నీ నిర్మూలించాలంటే ముందు యువత ఆలోచనా విధానంలో మార్పు రావాలి. కులమతాల వైషమ్యాల కారణంగా యువత పెడదారి పట్టకుండా, సమాజాన్ని సరైన దృష్టికోణంలో చూడగలిగేలా థియేటర్ ఆర్ట్ ద్వారా కృషిచేస్తోంది ఢిల్లీకి చెందిన ఒక ఎన్ పి ఒ సంస్థ. ఇక్కడ కళాకారులు ప్రదర్శించే అంశాలన్నీ వారి యథార్థ గాథలే. ఇవి సమాజ మార్పుకీ దోహదపడుతున్నాయి.

సమాజ మార్పుకో నాటకం

వెనుకబడిన వర్గాలకి చెందిన ప్రజలు ఇప్పటికీ అగ్రవర్ణాల అవమానాలు, ఛీత్కారాలకి గురౌతున్నారు. ఇతరులని చులకనగా చూసే వారి ఆలోచనల్లో మార్పు రావాలంటే ఎదుటివారి శక్తిసామర్థ్యాల్ని, బాధల్ని వారికి కళ్లకు కట్టేలా చూపగలగాలి. అప్పుడు మాత్రమే ఎదుటివారిని అవమానపరిచే వారి ధోరణుల్లో మార్పుతేవడం సాధ్యపడుతుంది. సామాజిక తరగతులు వేరయినా మనుషులందరూ ఒక్కటే అనే నినాదాన్ని యువతకి అర్థమయ్యేలా చేసేందుకు థియేటర్ ఆర్ట్ ద్వారా పనిచేస్తోంది 'తసవ్వుర్'. ఢిల్లీకి చెందిన కళాకారులు, విద్యావేత్తలు యువతతో కలిసి పనిచేస్తున్న ఒక ఎన్‌పిఒ(నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్) సంస్థ తసవ్వుర్. ప్రముఖ విద్యావేత్త, కవయిత్రి అదితి రావ్ సామాజిక మార్పుకోసం రెండేళ్ల క్రితం ఈ సంస్థని ఏర్పాటుచేశారు. ఇక్కడ సభ్యులుగా ఉన్న వారు ఢిల్లీలోని స్కూళ్లు, ఎన్‌జిఒలని సందర్శించి కళారంగంపై అభిరుచి ఉన్న యువతని ఎంపికచేస్తారు. ఐదు నెలలపాటు కొనసాగే శిక్షణలో ప్రతి ఆదివారం ఐదారు గంటల పాటు వివిధ అంశాలపై అవగాహనా తరగతుల్ని నిర్వహిస్తారు. కళాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే కార్యక్రమాలతోపాటు వ్యాయామం, ఇతరులకి సాయపడడం వంటివి రోజువారీ శిక్షణలో భాగంగా ఉంటాయి. సామాజిక మార్పుకి దోహదపడే అంశాల్ని బోధించడంతో పాటు

అదితి రావ్

అందరూ ఐకమత్యంతో పనిచేసేవిధంగా వారిని తీర్చిదిద్దుతారు. 100 అవర్ ఆర్ట్స్ పేరుతో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమంలో సామాజిక మార్పు ప్రధాన లక్ష్యం. సమాజ మార్పుకి దోహదపడే కళాప్రదర్శనల్ని అందించే ముఖ్య ఉద్దేశంతో పనిచేస్తున్న ఈ సంస్థలో వివిధ నేపథ్యాల నుండి వచ్చిన యువకులు బృందాలుగా ప్రదర్శలు ఇస్తారు. అంగవైకల్యంతో పోరాడుతున్న యువకులు, ఆఫ్ఘన్ నుండి శరణార్థిగా వచ్చిన బాలుడు, దళిత యువకులు ఇక్కడ కళాకారులుగా పనిచేస్తున్నారు. వాస్తవిక విషయాల్ని అద్దంపడుతూ ఇక్కడి కళాకారులు ప్రదర్శించే అంశాలన్నీ వారి యదార్థ గాథలే. ఈ ప్రదర్శనలు ఒకరి గురించి మరొకరు తెలుసుకునేలా చేయడమే కాదు ఎదుటివారిని గౌరవించే లక్షణాన్నీ పెంపొందిస్తున్నాయి. ఇంటరాక్టివ్ సెషన్‌లో భాగంగా తమ అలోచనల్ని పంచుకుంటారు. జట్టు సభ్యుల్లో ఆడపిల్లలు, ఆకతాయిల వల్ల ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రస్తావిస్తుంటారు. ఇలాంటి ప్రస్తావనలు తుంటరి ప్రవర్తన కలిగిన యువకులల్లో మార్పుకి దోహదపడ్డాయి. కళాకారుల మనసుని హత్తుకున్న ఆ గాథలే కళాప్రదర్శనలుగా సమాజంలో మార్పుకి తోడ్పడుతున్నాయి. పరిచయ వేదిక ద్వారా లభిస్తున్న ప్రేరణతో తమ జీవితాన్ని మెరుగుపరుచుకోవడంతోపాటు ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనే లక్షణాల్ని యువత పెంపొందించుకుంటోంది. చివరి రెండు నెలల్లో ఒక్కో జట్టు ప్రదర్శనల కోసం సొంతంగా స్క్రిప్ట్‌ని తయారుచేసుకోవాలి. సొంత విషయాల్ని కాకుండా ఇతరుల జీవిత విషయాల ఆధారంగా స్క్రిప్ట్‌ని తయారుచేసుకుని సొంత డైరెక్షన్‌లో ఒక్కొక్కరు ప్రదర్శనలివ్వాల్సి ఉంటుంది. నైపుణ్యాన్ని వెలికి తీసే ఈ ప్రదర్శన మొత్తం శిక్షణకే కీలకంగా ఉంటుంది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలని పెంచే ఈ ఘట్టాలన్నీ కళాకారుల్లో అసలైన నాయకత్వపు విలువని అవగతం చేస్తున్నాయి. ఈ వేదిక ద్వారా ఇప్పటి వరకు 60 మంది యువత ప్రదర్శనలిచ్చారు. వీరిలో దాదాపు 85 శాతం మంది నిరుపేద కుటుంబాలకి చెందిన వారే. వీరి ద్వారా విదేశాల్లో ఇవ్వబడిన ప్రదర్శనలు ఎంతో మంది ప్రశంసలని అందుకున్నాయి. భాష, మతం, ప్రాంతీయ భావనలకు తావివ్వకుండా సమాజ మార్పు కోసం కలసికట్టుగా కృషిచేస్తున్న కళాకారులని తీర్చిదిద్దడం కోసం మరింతగా కృషి చేస్తోంది తసవ్వుర్ సంస్థ.

– శర్వాణి

ఇండెక్స్

వినూత్నం........3

ఓ ఆలోచన మార్పు తెచ్చింది

స్టార్........4

కొలవెరి ఎలా

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం..........10

48 ఏళ్ల అమ్మాయి

విజేత..............11

కబడ్డీలో రో..హిట్

కవిత్వమ్..................14

బాల కార్మికులు

ఉద్వేగాల రేటింగ్స్



అట్టమీది కథ...6

వివరం - 12

భారత్‌లో జురాసిక్ పార్క్

తెలుసా....................15

జీరో హంగర్ ప్రపంచం కోసం

కథ 16

జాతిచెట్టుకు వేరుపురుగులు

రుచి....................21

గ్రీన్ మసాలా ఫిష్ ఫ్రై

బాల నేస్తాలు............23

పిట్ట కొంచెం తోక ఘనం

పద వికాసం.....

....24

ఆకట్టుకున్న పనిమనసు

పని మనుసు పేరుతో ఇచ్చిన కథనం స్ఫూర్తిదాయకంగా ఉంది. పనివాళ్ల పిల్లల చదువు కోసం అపార్టుమెంట్ వాసులు చేస్తున్న కృషి అభినందనీయం. బెంగుళూరులోని టాటా షేర్‌వుడ్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు.అలాగే విందులు...వింతలు కథనం చదివి చాలా ఆశ్చర్యానికి గురయ్యాం. దేశంలోని వివిధ రెస్టారెంట్లు గురించి చక్కగా వివరించారు. అలాగే వివిధ వస్తువులను సేకరిస్తున్న చరిత్ర వేటగాడైన ఆదిత్య విజ్ పట్టుదల, కృషికి సలాం.

-వద్ది దుర్గారావు, ఎల్ఎన్‌డీ పేట

గీతల్లో గాంధీ

గాంధీ జయంతి సందర్భంగా అందించిన కవర్ స్టోరీ 'గీతల్లో గాంధీ' చాలా బాగుంది. వ్యాసకర్త మంచి సమాచారం అందించారు. గాంధీ అంటే ఆర్టిస్టులకు, కార్టూనిస్టులకు కల్పతరువు. గృహ ప్రవేశం చిత్రానికి సంబంధించిన సమాచారం చాలా ఆసక్తిగా ఉంది. ఆనాటి అపురూప చిత్రాల విశేషాలు అందించడం అభినందనీయం. నాన్న నన్ను క్షమించు కథ చిన్నదే అయినా అందించిన

సందేశం మాత్రం పెద్దదే. సెకెండ్ హ్యాండ్ పుస్తకాల షాపులకు సంబంధించిన వ్యాసం, కవిత్వంలో కవితలు బాగున్నాయి. బాల నేస్తాలలో బాలల కోసం చక్కని సమాచారాన్ని అందిస్తున్నారు. మొత్తంగా ప్రజాశక్తి స్నేహలో అన్ని అంశాలు మాకు విజ్ఞానాన్ని, వికాసాన్ని అందిస్తున్నాయి.

-మార్టూరు అజయ్ కుమార్, రామచంద్రాపురం

ఊరి కోసం

స్నేహ సంచికలో వచ్చిన మరో అమ్మ కథనం ద్వారా నీరజ లక్ష్మి మొహాపాత్ర వంటి మహనీయుల వల్ల మానవత్వం ఇంకా బతికే ఉందనిపించింది. నిజమైన హీరోగా ఊరి కోసం సహాయ సహకారాలందిస్తున్న బాలమురుగన్ గారికి హ్యాట్స్ ఆఫ్. నాన్న నన్ను క్షమించు కథకర్తకు అభినందనలు. కలప కళలు వారెవా అనిపించాయి. కుస్తీ నీతు వంటి వారు ఎందరికో స్ఫూర్తి ప్రదాతలు. చిరునవ్వుతో విశేషాలు నవ్వు మహత్తును, మహత్యాన్ని అభివ్యక్తీకరించాయి. 'రెండో యాత్ర' ఎందరికో చైతన్య స్ఫూర్తి నిచ్చే కథనం. నవ్వుల్ పువ్వుల్ కిసుక్కు మనిపించాయి.

-నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం

చెస్ మాస్టర్

తొమ్మిదేళ్ల సచిన్ దేవ్ చెస్ ఆటలోనే కాదు తన ఇంటెలిజెంట్ ప్రసంగాలలోనూ మాస్టరే అనిపించాడు. పుస్తకాల ప్రేమికులకు సెకండ్ హ్యాండ్ బుక్స్ దొరికే మార్కెట్ల వివరణ తృప్తి కలిగిస్తుంది. యాసిడ్ దాడి బాధితులకు అండగా నిలిచి వారి ఎదుగుదల కోసం ట్రావెల్ సంస్థను నిర్వహిస్తున్న ఆకాష్ వివరణ చెప్పుకోదగినది. నీతూ సర్కార్ టీనేజ్‌లో అనుభవించిన కష్టాలు చలింపచేశాయి. తను పుట్టిపెరిగిన గ్రామాన్ని దత్తత తీసుకుని బాల మురుగన్ అభివృద్ధిపర్చడం అభినందనీయం.

- టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఓ ఆలోచన మార్పు తెచ్చింది

చిన్నారుల అభివృద్ధికి మన విద్యావిధానాల్లో మార్పు రావాలనేది విద్యావేత్తల మూకుమ్మడి అభిప్రాయం. మార్పు అనేది ప్రస్తుతం పుస్తకాలకో, ఉపాధ్యాయుల ప్రసంగాలకో పరిమితమైతే ఎలా? మారుతున్న ప్రపంచపు సాంకేతికతను గ్రామీణ పాఠశాలల్లోకి చేరిస్తేనే కదా ఫలితం. ఈ-బుక్స్, వికీపీడియా వంటి ఇంటర్నెట్ అవకాశాల ద్వారా గ్రామ విద్యార్థి వికాసపు పరిధిని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లొచ్చు. సమస్తిపూర్ గ్రామీణ పాఠశాలలో కంప్యూటర్, ప్రాజెక్టర్‌లని ప్రవేశపెట్టి గ్రామంలోని విద్యార్థుల వికాసానికి కృషిచేస్తున్నాడు బీహార్‌కి చెందిన ఓ ఎన్ఐటి విద్యార్థి.

తరగతి గది పాఠాలతోపాటు విద్యార్థులకి లౌకిక విషయాలపై అవగాహన ఎంతో అవసరం. ప్రయోగాల ద్వారా పాఠాలను నేర్పే విధానాలు కరువవడంతో నేటి విద్యావిధానాలు పిల్లలకి నాణ్యమైన విద్యని అందించలేకపోతున్నాయి. గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థులకి తరగతి గది పాఠాలు తప్ప పరిశీలనాత్మకమైన విద్య అందకుండా పోతోంది. ఈ విషయాలన్నీ ఒడిశా ఎన్ఐటి రూర్కెలాలో ఎమ్‌టెక్ చదువుతున్న సాయి రథ్‌ని ఆలోచనలో పడేశాయి. చిన్నతనం నుండి గ్రామీణ వాతావరణంలో పెరిగిన సాయిరథ్‌కి కళాశాల చదువు ప్రయోగాత్మక విద్యంటే ఏంటో తెలిసేలా చేసింది. అనుభవమున్న కంప్యూటర్స్ ద్వారా పరిశీలనాత్మక విద్యని సమస్తిపూర్ గ్రామంలో ప్రవేశపెట్టాలనుకున్నాడు. ఆ విధానాన్ని అమలుపరిచేందుకు ఎస్‌బిఐ ఫెలోషిప్‌తోపాటు కొందరు దాతల సహకారం అందుకున్నాడు. 2015 నుండి సమస్తిపూర్‌లోని పూసా ప్రాంతంలో గ్రామీణాభివృద్ధికి కృషిచేస్తున్న అగాఖాన్ రూరల్ డెవలప్‌మెంట్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్న బృందంతో కలిసి పనిచేయడం ప్రారంభించాడు సాయిరథ్. తను చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ముందుగా సమస్తిపూర్ గ్రామంలోని 16 (ప్రభుత్వ-ప్రయివేటు) పాఠశాలల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నందుకుగల కారణాల్ని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నాడు సాయిరథ్. ఒక్కో పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులకి అతి తక్కువ మంది ఉపాధ్యాయులతో బోధన కొనసాగుతుండటంతో పాటు, కొత్త ప్రయోగాలపై ఆసక్తి చూపని ఉపాధ్యాయులే ఉత్తమ విద్యను అందించలేకపోతున్నారనే విషయాలు వెలుగులోకొచ్చాయి. ఇలాంటి సమస్యలన్నిటికీ ఒక ల్యాప్‌టాప్, ప్రాజెక్టర్ సాయంతో పరిష్కారాన్ని చూపాడు సాయిరథ్. పనికి రాని వస్తువులతో బొమ్మల్ని తయారుచేసే విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకి చూపిన ఓ ప్రయోగం మంచి ఫలితాల్ని ఇవ్వడంతో ఈ విధానాన్ని బెరోఖరా మాధ్యమిక పాఠశాల విద్యాబోధనలో ప్రవేశ పెట్టారు. తక్కువ ధరలో ఐఐటి ముంబై అందించిన ల్యాప్‌టాప్‌లతో బెరోఖరా మాధ్యమిక పాఠశాలలో ఒక ల్యాబ్‌ని



ఏర్పాటు చేశాడు. గ్రామాల్లో కంప్యూటర్ శిక్షణ చాలా వరకు ఆటలు, బొమ్మలు వేయడం లాంటి చిన్న చిన్న ప్రయోగాలకే పరిమితమవుతోంది. అలా కాకుండా కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ల ద్వారా విద్యార్థులకు దాదాపు 352 ఈ-బుక్స్‌ని అందుబాటులో ఉంచాడు. తరగతిలో ఎక్కువ మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు చెప్పే అంశాలు చేరేలా ప్రొజెక్టర్ సాయంతో పాఠ్యాంశాల్ని ఎలా బోధించాలనే విషయాలపై శిక్షణనిచ్చాడు. ఈ-బుక్స్ ద్వారా తెలుసుకున్న కొత్త విషయాలను ప్రయోగాల ద్వారా సరిచూసుకునేందుకు విద్యార్థులు పరిశీలన, ప్రయోగాలపై ఆసక్తి చూపుతున్నారు. పాఠ్యాంశాలకు సంబంధించి మరిన్ని కొత్త విషయాలని తెలుసుకునేలా వికీపీడియాని ఉపయోగించుకునేలా శిక్షణ అందించాడు. విద్యార్థులకి బోధపడని అంశాల్ని ఒక పాఠ్యాంశంలా కాకుండా వాటిని బొమ్మల ఆధారంగా అర్థమయ్యేలా బోధిస్తుంటారు. కష్టంగా ఉండే అంశాల్ని ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేసి కంప్యూటర్‌లలో పొందుపరచడంతో చిన్నారులు చదువుపై మరింత ఆసక్తి చూపుతున్నారు. బెరోఖరా మాధ్యమిక పాఠశాలలో మంచి ఫలితాలు అందించిన ఈ విద్యావిధానాలని గ్రామంలోని మరిన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టేందుకు కృషిచేస్తున్నాడు సాయిరథ్.

- శారద

కొలవెరి ఎలా

స్టార్



తమిళనాట పేరొందిన హీరో ధనుష్. పదహారేళ్ల ప్రాయంలో తమిళ చిత్రసీమలో అడుగు పెట్టి సహజ నటుడిగా స్టార్ ఇమేజ్‌ని సొంతంచేసుకున్నాడు. అంతకు మించి తనో అద్భుత డాన్సర్. ఇంగ్లీష్ పదాల్ని మిక్స్‌చేస్తూ తను పాడిన 'కోలవెరి ది' పాటతో యూత్ ఐకాన్‌గా మారాడు. సూపర్ స్టార్ రజనీకాంత్ అల్లుడయినా నటుడిగా గీత రచయితగా, గాయకుడిగా ఒక్కో మెట్టూ పైకెదుగుతూ సినీ పరిశ్రమలో సొంత ఇమేజ్‌ని పెంచుకున్నాడు ధనుష్.

- ధనుష్ అసలు పేరు వెంకటేష్ ప్రభు. తండ్రి కస్తూరీ రాజ, అన్న సెల్వరాఘవా ఇద్దరూ తమిళ చిత్రసీమలో పేరొందిన డైరెక్టర్లు.
- సూపర్ స్టార్ రజనీ కాంత్ అల్లుడుగా కంటే తన మల్టీ టాలెంట్‌తో దమ్మున్న హీరోగా పాపులారిటీని పెంచుకున్నాడనే చెప్పాలి.
- సినిమా రంగం పై అస్సలు ఆసక్తిలేని ధనుష్ హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి మంచి చెఫ్ అవ్వాలనుకున్నాడు.
- యాక్టింగ్ ఇష్టం లేకపోయినా అన్న సెల్వరాఘవ ప్రోద్భలంతో సినిమా రంగంలోకి ప్రవేశించాడు ధనుష్. సినిమాల్లోకి రాకుండా తప్పించుకుందామని ఎన్నో పథకాలు రచించేవాడట. అయినా సెల్వరాజా గట్టిపట్టుపట్టడంతో ధనుష్‌కి యాక్ట్ చేయలేక తప్పలేదు.
- తండ్రి కస్తూరీ రాజ దర్శకత్వంలో వచ్చిన 'తుల్లువధొ ఇల్లమి' చిత్రం ద్వారా 16వ ఏట చిత్రసీమలో అడుగు పెట్టాడు. తమిళ చిత్రసీమలో ఆ చిత్రం పెద్ద హిట్ చిత్రంగా నిలిచింది.
- తర్వాత అన్న సెల్వరాఘవ దర్వకత్వంలో 2003లో వచ్చిన 'కాదల్ కొన్డెయిన్'లో నటించాడు ధనుష్. ఈ చిత్రం హీరోగా తనకి మంచి గుర్తింపుని తెచ్చిపెట్టింది.
- అప్పటి నుండి ధనుష్‌కు వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు.
- కాదల్ కొన్డెయిన్‌కి స్క్రీనింగ్ జరుగుతున్నప్పుడే ధనుష్‌కి తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కూతురు ఐశ్వర్యతో పరిచయం ఏర్పడింది.
- అదే చిత్రంలో కలసినటించారిద్దరూ. ఇద్దరి మధ్యా ప్రేమ చిగురించడంతో నవంబర్ 11 2004లో వివాహబంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు.
- స్క్రీనింగ్ తర్వాత ఒక బొకే ద్వారా ఐశ్వర్య పంపిన 'గుడ్ వర్క్ కీపిన్ టచ్' అనే మెసేజ్ వారిద్దరినీ జీవిత భాగస్వామ్యులని చేసిందంటాడు ధనుష్. వీరిద్దరి పిల్లలూ యాత్ర, లింగ.
- ఈ 'తిరుద తిరుద' చిత్రం ద్వారా స్టార్ ఇమేజ్‌ని సొంతం చేసుకుని మంచి ఫామ్‌తో ధనుష్ యాక్షన్ సినిమాల్లోకి ప్రవేశించాడు.
- స్టాన్లె దర్శకత్వంలో వచ్చిన 'పుదుకొట్టయిలిరిందు శరవణన్(2003)', 'సల్లాన్'(2004) రెండు యాక్షన్ చిత్రాలు పరాజయాన్ని మిగిల్చాయి.
- యాక్షన్
  చిత్రాలకి తగిన ధీటైన శరీరాకృతి లేకపోవడమే ఈ చిత్రాల పరాజయానికి కారణమనేది సినీ విశ్లేషకుల అభిప్రాయం.
- తిరిగి సెల్వరాఘవ దర్శకత్వంలో 'పుదుపెట్టై' చిత్రంలో గ్యాంగ్‌స్టర్‌గా నటించాడు.
- ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచినా మంచి బాడీల్యాంగ్వేజ్, అద్భుత నటనతో వేలాది అభిమానుల్ని సంపాదించుకున్నాడు ధనుష్.
- ఒక పేదింటి అబ్బాయి, డబ్బున్న అమ్మాయిల మధ్య చిగురించిన ప్రేమ కథాంశంతో వచ్చిన చిత్రం 'తిరువిలయాదల్ ఆరంబమ్'. వరుస పరాజయాలు చవిచూసిన ధనుష్‌కి మూడేళ్ల తర్వాత ఒక మంచి కమర్షియల్ హిట్‌ని అందించిందీ చిత్రం.
- 2007లో విడుదలైన 'పరట్టాయ్ ఎంగిర అళగు సుందరం' కన్నడ చిత్రం 'జోడీ' రీమేక్. ధనుష్ కెరీర్‌లో పెద్ద పరాజయాన్నిచ్చిందీ చిత్రం.
- పరాజయాల్ని పక్కకునెట్టి నటుడిగా తన వృత్తి కోసం కష్టపడేవాడు ధనుష్.
- 2008లో 'కుచేలన్' చిత్రంలో రజనీకాంత్‌తో కలిసి నటించే అవకాశం వచ్చింది.
- 2011లో 58వ నేషనల్ అవార్డ్‌లో భాగంగా 'ఆదుకాలం' చిత్రం ద్వారా బెస్ట్ యాక్టర్ అవార్డుని అందుకున్నాడు.
- నటనతో పాటు, గాయకుడిగా గీత రచయితగా ఆడపాదడపా సినిమాలకి పనిచేసినా పూర్తి స్థాయిలో సింగర్‌గా మార్చిన చిత్రం 'పుదుకొట్టైయిలిరున్దు సెరవణన్'.
- ఈ చిత్రం తర్వాత 'ఆయిరిథిల్ ఒరువన్', 'మయక్కమ్ ఎన్న' చిత్రాలకు ధనుష్ ఒకటి రెండు పాటలు పాడినా తనని గొప్ప గాయకుడిగా ప్రపంచానికి పరిచయం చేసిన గీతం 'కొలవెరి డి'.
- 2012లో '3' చిత్రానికి పాడిన కోలవెరి డి, వేలాదిమంది మనసుల్ని హత్తుకుంది. భార్య ఐశ్వర్య దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో ధనుష్ ఆరు నిముషాల్లో 'కొలవెరి డి' పాటని రాయడంతో పాటు సొంతగా పాడి 35నిమిషాల్లో మొత్తం రికార్డింగ్‌ని పూర్తిచేశారు.
- యూ ట్యూబ్‌లో అధికంగా హల్‌చల్ చేసిన ఈ పాట ద్వారా ప్రపంచస్థాయి గుర్తింపుతో పాటు 'యూట్యూబ్ గోల్డ్ అవార్డ్'ని అందుకున్నాడు.
- 2013లో 'రాంఝనా' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోనూ తన సహజ నటనతో ప్రేక్షకులని మెప్పించాడు.
- తనదైన సహజ నటనతోపాటు డ్యాన్సర్‌గా, గీత రచయితగా, గాయకుడిగా ఒక్కో మెట్టూ పైకెదుగుతూ సినీ పరిశ్రమలో మరింత పేరుతెచ్చుకున్నాడు ధనుష్.

నవ్వుల్ - పువ్వుల్

చిల్లర కోపం

వెంగళప్ప ఓ షాపు వద్దకెళ్లి....
వంద రూపాయలకు చిల్లరుందా
అప్పారావు: లేదని ఎన్నిసార్లు చెప్పాలి వెళ్లవయ్య
వెంగళప్ప: ఆఫ్టాల్ వంద రూపాయలకు చిల్లరడిగితే అంత కోపం ఎందుకయ్యా.....మరి బైట చిల్లర కొట్టు అని బోర్డెందుకు పెట్టినట్టు?



పండగ వసూలు

దానయ్య: బస్సు చార్జీలు పెరిగినప్పటి నుంచి మా అల్లుడు రాకపోకలు తగ్గించాడోయ్.
గోపయ్య: మీ అల్లుడే నయం మా అల్లుడు వచ్చిన ప్రతి సారీ చార్జీలు నా దగ్గరే వసూలు చేస్తున్నాడు.

కిసుక్కు

చింటు: మమ్మీ నాకు ఇరవై రూపాయలు కావాలి. ఒక పేదవాడికి సాయం చేస్తాను...
తల్లి: మా నాయనే.... ఎంత దయ నీకు. ఇంతకీ ఆ పేదవాడు ఎక్కడున్నాడు?
చింటు: అదిగో ఆ ఎండలో ఐస్ క్రీం అమ్ముతున్నాడు.

కుక్క కాపలా

భార్య: కాపలాకి కుక్కను కొనుక్కొచ్చారుగా ....ఇంకా గేటు దగ్గరే కూర్చొని చూస్తున్నారేమిటి?
భర్త: కుక్కను ఎవరైనా ఎత్తుకు పోతారేమోనని చూస్తున్నాలే!



జంపింగ్

చింటు: బంటి స్టౌ మీద ఉన్నప్పుడు పాప్‌కార్న్ ఎందుకు జంప్ చేస్తుంటుందంటావ్! ఈ విషయాన్ని తెలుసుకోవాలని నాకు చాలా ఆసక్తిగా వుంది.
బంటి: వెరీ సింపుల్! నువ్వు ఒక సారి స్టౌ మీద కూర్చుని చూడు విషయం నీకే తెలుస్తుంది!

తండ్రి: ఏరా ఎందుకలా నిలబడి భోజనం చేస్తున్నావ్?
కొడుకు: భార్య సంపాదిస్తుంటే కూర్చుని తింటున్నాడని అందరూ చిరాకు పడుతున్నారు అందుకే నిల్చుని తింటున్నా!

కొత్త కవిత

గుర్నాథం: నేనిప్పుడు వినిపించిన కొత్త కవిత ఎలా ఉంది?
జగన్నాథం: నేనింకా సజీవంగా ఉన్నందుకు ఆశ్చర్యంగా వుంది.

షాపింగ్

జడ్జి: ఏం చేశావని అరెస్టయ్యావు...?
ముద్దాయి: పెందరాళే షాపింగ్ చేసినందుకు అరెస్ట్ చేశారు.
జడ్జి: అదేం తప్పు కాదే.... అయినా ఎంత పెందరాళే షాపింగ్ చేశావేంటి?
ముద్దాయి: ఇంకా ఆ షాపు తెరవక ముందే...

గిఫ్ట్

అమ్మాయి: నా పుట్టిన రోజు అని తెలిసి ఏ బహుమతి తేలేదే..?
అబ్బాయి : నువ్వే కదా సర్‌ప్రైజ్ చేయమన్నావ్..!

ఉద్వేగాల రేటింగ్స్



రియాల్టీ అంటే వాస్తవం. షో అంటే ప్రదర్శన. ఇవి రెండూ నిజానికి పరస్పర భిన్నమైన అర్థం ఇచ్చే పదాలు. నిజంగా జరిగేది రియాలిటీ. కావాలని ప్రదర్శించేది షో. అందులోనూ షో, షోయింగు వంటి తెలుగాంగ్ల పదాలు అవతలి వారిని ఎగతాళి చేసేందుకే వాడతాం. అయితేనేం మాయా పేటిక లేదా అద్భుత వాహిక కాదంటే ఇడియట్ బాక్స్ అనబడే టీవీ ఈ రెండు పదాలనూ కలిపేసింది. కలగాపులగం చేసింది. మీరు చూస్తుంది నిజం అని మనతో అనిపిస్తూనే తను అనుకున్నట్టు చేయగలుగుతుంది. రియాల్టీ షో అంటే అదే. మనుషులుంటారు. మాట్లాడుతుంటారు. నవ్వుతుంటారు. ఏడుస్తుంటారు. పాడుతుంటారు. ఆవేశపడుతుంటారు. విన్యాసాలు చేస్తుంటారు. వివాదపడుతుంటారు. విజయాలు సాధిస్తుంటారు. విచిత్రాలు చేస్తుంటారు. ఇవన్నీ నిజంగా లైవ్ అనబడే ప్రత్యక్ష ప్రసారంలో చేస్తుంటారు గనక రియాల్టీ. కావాలని మనం చూసేలా చేస్తున్నారు గనక షో. శృతి మించిపోతున్న, పరిణతి దిగజారిపోతున్న ఈ రియాల్టీ షో తీరులు... ఉద్వేగాల రేటింగ్‌ల తెన్నులపైనే ఈ వారం అట్టమీది కథ.

- పి.పి.

దేశంలోనూ తెలుగు ఛానళ్లలోనూ అనేక రియాల్టీ షోలు ఇప్పుడు కాసులు కురిపిస్తున్నాయి. కెవ్వు కేక పెట్టిస్తున్నాయి. భళారే విచిత్రం అనిపిస్తున్నాయి. జబర్దస్త్ కామెడీ చేసేస్తున్నాయి. మీరు కోటీశ్వరులు కావొచ్చునని ఆశపెట్టి తీసుకుపోతున్నాయి. మహాలక్ష్మి అవుతారని వూరిస్తున్నాయి. బతుకు జట్కాబండిలో కూచోబెట్టి తీసుకుపోతున్నాయి. రచ్చబండను నట్టింటికే తెచ్చి చూపిస్తున్నాయి. కబడ్డీలోనూ కెవ్వు కేక పెట్టిస్తున్నాయి. నా పాట నీ నోట పలకాల చిలకా అంటూ ఏళ్ల తరబడి పాడిస్తున్నాయి. కుర్రకారుతో వెర్రిమొర్రి వేషాలు వేయిస్తున్నాయి. డాన్సులో సర్కస్‌లో తెలియని విన్యాసాలు చేయిస్తున్నాయి. నిప్పుల్లో దూకిస్తున్నాయి. నిలువునా వణికిస్తున్నాయి. కిందపోసి ఎత్తడం, పగిలించి అతికించడం, సూదులు గుచ్చడం, ఈకలు పీకడం ఒకటేమిటి దండగమారి పనులెన్నో చేయించి ఒక చీరో గొలుసో ఇచ్చి పంపిస్తున్నాయి. ఇవన్నీ ఏం చేసినా వీటన్నిటికి ముద్దుపేరు రియాల్టీ షోనే. ఎందుకంటే అక్కడుండే వారు మనలాంటి మనుషులే గనక. నటీనటులు కాదు గనక.

అయితే నటీనటులు వుండరని కాదు, వుంటారు గాని మనతో చేయించేంత వరకే. కాకపోతే తమ చలాకీతనంతో చమత్కారాలతో షోలను రక్తి కట్టిస్తుంటారు. మనలాటి మామూలు మనుషులను చూసేందుకు ప్రేక్షకులు సిద్ధం కారు గనక వారిని కూడా తోడు చేసి కథ నడిపించేస్తుంటారు. అయితే వారు కూడా మామూలు వాళ్లలాగే మాట్లాడుతున్నట్టు కనిపిస్తుంటారు. కాని మన నుంచి రిజల్టు లేదా ఎఫెక్టు రాబట్టడానికి వారి టాలెంటు చూపిస్తుంటారు. అంతెందుకు? మీలో ఎవరు కోటీశ్వరుడు అన్న మాటీవీ షో అక్కినేని నాగార్జున ఆద్యంతం రసవత్తరంగా నడిపించారు. కొంత విరామం తర్వాత ఇప్పుడు సాక్షాత్తూ మెగాస్టార్ చిరంజీవి దాన్ని నడిపించేందుకు సిద్ధమై పోయారు. 'ఖైదీ150'గా రీ ఎంట్రీ ఇచ్చే ముందు ఈ విధంగా బుల్లితెరపై కనిపించి ప్రేక్షకులకు దగ్గరవుదామని ఆయన ఆలోచిస్తున్నారంటేనే ఈ షోల పాపులారిటీ ఏంటో తెలుస్తుంది. సినిమాల్లో ఇంకా పూర్తిగా స్టార్‌లు కాని వాళ్లు, టాలెంటుకు తగ్గ అవకాశాల కోసం వెతుక్కునేవాళ్లు కూడా లైవ్ పెర్ఫామెన్సు ఇస్తుంటారు. ఎక్కువ భాగం నవ్వులు, కొంటె వేషాలే వుంటాయి కాని కొన్ని గుండెలు బరువెక్కించేవి, లేదా రెచ్చగొట్టి రిస్కులు చేయించేవి కూడా వుంటాయి. ఇష్టమైన షోలో నచ్చిన వాళ్లు వస్తే, లేక వచ్చిన వాళ్లు బాగా చేస్తే ఈ తరహా వీక్షకులకు కన్నుల పండుగే. దాంట్లో లీనమై పోతారు. ఏడ్చేస్తారు, ఎగిరి చిందులేస్తారు. ఇదంతా ఒక ఉద్వేగ వ్యాపారం. ఉద్రేకాల వ్యవహారం. వినోదాల వికృతాల విన్యాసం. ఇవన్నీ ఎంత ఎక్కువగా జరిగితే ఆ షో అంత జయప్రదమైనట్టు. రేటింగులే ఇక్కడ కొలబద్దలవుతుంటాయి.

కొన్ని విపరీత షోలు

టీవీలలో ప్రయాస లేకుండానే ఉద్వేగ ప్రేరేపణ జరిగిపోవడం గమనించని విపరీతం. ఉదాహరణకు ఒక పిల్లవాడు విషాదకరంగా చనిపోయాడనుకుందాం. దాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం ఎలాగూ జరుగుతుంది. ఈ ప్రసారంతో పాటు అతనికి సంబంధించిన వారితో మాట్లాడించాలి. తల్లిదండ్రులతో మాట్లాడించడానికే ముందు ప్రాధాన్యత. అక్కడ చాలామంది విషాద సందర్భాల్లో కూడా టీవీ మైకుల ముందు మాట్లాడ్డానికి సిద్ధమౌతారు. విషాదానికి సరిపడని రీతిలో కూడా వారు మాట్లాడ్డం కద్దు. అప్పటి వరకూ తాము ఇలాంటి సందర్భాల్లో చూసిన రీతిలోనే మాట్లాడబోతారు. 'సరిగ్గా' రాలేదనుకుంటే ఆ టీవీ జర్నలిస్టు సూచనలు కూడా చేస్తాడు. ఆ దృశ్యాన్ని వూరికే చూపించినా, నేరుగా మైకు ముందు మాట్లాడించినా అసహజత్వం వచ్చేస్తుంటుంది.

విషాద స్పర్శ పలచబడుతుంది. ఇదే పరిస్థితి సంతోష సందర్భాల్లోనూ కనిపిస్తుంది. ఆ విజయంలో విశిష్టత కన్నా వ్యక్తిగతంగా ఆకర్షణీయంగా చూపించడం ప్రధానమై పోతుంది. వారు కూడా ముందే ఒక ప్రత్యేక తరహాలో మాట్లాడ్డానికి చేయి వూపడానికి సిద్ధమై వుంటారు. విషాదం వినోదాలతో సంబంధం లేకుండా పక్కనుండి కనిపించాలనుకునే వారు సరే సరి. ఒకోసారి పరస్పరం పోటీ పడ్డం మరీ ఎబ్బెట్టుగా వుంటుంది. ఇవన్నీ కూడా సహజ స్పందనలను మొద్దు బారుస్తాయి.

రాఖీ సావంత్ స్వయంవర వివాహ ప్రహసనం. తనకు కాబోయే వరుడిని ఎంచుకోవడానికి పురాణ కాలంలో వలె స్వయంవరం ఏర్పాటు చేసుకోవడం బాగానే వుంది. కాని దాన్ని బహిరంగ కార్యక్రమంగా మార్చుకోవడం ఈ తతంగానికి ముందస్తుగా అంత హంగామా దేనికి? పెళ్లి వ్యక్తిగత వ్యవహారమైతే వరుడి ఎంపిక మరింత వ్యక్తిగతంగా జరగాల్సిన తంతు. బుల్లితెరపై ఆమె ఒక్కో వరుణ్ని అడిగిన ప్రశ్నలు చూపించిన హావభావాలతో మామూలు ప్రేక్షకుడికి సంబంధం ఏమిటి? సినిమా తారల పట్ల ప్రత్యేకించి ఐటెం సాంగ్స్ (వెనకటికి క్లబ్ డాన్స్ అనేవారు) నర్తకీమణుల పట్ల వుండే జనాకర్షణను సొమ్ము చేసుకోవడం తప్ప ఇందులో వేరే పరమార్థం ఏమైనా వుందా? పిల్లలను కనడం పాలివ్వడం కూడా టీవీ ఛానెళ్లకు అమ్ముకున్న హాలీవుడ్ తారామణులున్నారు. ఇది తల్లిపాల ప్రశస్తి చెప్పడానికి అంటారు గాని అందుకు భారీగా పైకం తీసుకుంటారనేది నిజం. మీడియా వ్యక్తిగత జీవితాల్లోకి ఎక్కువగా తొంగి చూస్తుందని ఆరోపించే ఈ తారలే ఇలా చేయడంలో ద్వంద్వత్వమే ఉద్వేగ వ్యాపారం!

నట్టింట్లోకి

టాక్ షోలలో సెలబ్రెటీల వ్యవహారం కూడా కాసుల పంట పండిస్తున్నది. ఒకో చోట ఒక సెలెబ్రెటీ. ఇక్కడ హెూస్ట్ అక్కడ గెస్ట్. అక్కడ హెూస్ట్ ఇక్కడ గెస్ట్. తారల గురించి ప్రేక్షకుల మనస్సులో వుండే ఆకర్షణను ఆసక్తిని సొమ్ము చేసుకునే ప్రశ్నలు అదే పనిగా అడుగుతుంటారు. మధ్యలో వారికి సంబంధించిన వారిని ప్రవేశపెడతారు. కౌగిలించుకోవడం, ఎత్తుకుని తిప్పడం, ఏవేవో సరస



శృంగారాంశాలు ప్రస్తావించడం.. ప్రేమ ప్రశ్నలు కురిపించడం ఇదంతా సగటు మనుషులకు రంజుగా వుండేందుకే. ఇది కూడా ఒక్కసారితో పూర్తికాదు. దశలవారీగా సాగిపోతుంటుంది. వారు మాట్లాడేప్పుడు మరెవరినో వారితో ముడిపడినట్టు పేరున్నవారిని చూపించడం... ఇవే విషయాలు ఒకప్పుడు ఏ చవక బారు సినిమా పత్రికలోనో శృంగార పత్రికల్లోనో వస్తే తిట్టి పోసేవారు. కాని ఇప్పుడు నేరుగా సకుటుంబ మధ్యంలోకి చొచ్చుకువస్తున్నాయి. అందాల పోటీలు, క్యాట్ వాక్‌లు, మిడ్‌నైట్ మసాలాలు (వాటి తాలూకూ ప్రచార ప్రకటనలు లేదా ప్రోమోలు మాత్రం అన్ని వేళలా వస్తుంటాయి మరి) ఎంత ఎబ్బెట్టుగా వున్నదీ నిత్యానుభవమే.

పలు దేశాల్లో పరిశోధనలు

వాస్తవం ఏమంటే పశ్చిమ దేశాల్లోనూ దీనిపై ఆందోళనలు లేకపోలేదు. కళాశాలల్లో తుపాకుల స్వైర విహారం, సామూహిక కాల్చివేతలు, స్కూలు పిల్లల గర్భధారణలూ ఇవన్నీ పైప్రభావాల ఫలితమేనని వారూ అంగీకరిస్తున్నారు. ప్రత్యేకించి అమెరికాలోనైతే సెప్టెంబరు 11 దాడుల తర్వాత పత్రికలు, టీవీల ప్రభావాలను విడివిడిగా అధ్యయనం చేశారు. టీవీలు కలిగించే ఉద్వేగం చాలా ఎక్కువగా వుంటుందని నిర్ధారించారు. జరుగుతున్న తీరులోనూ ఎంతో కృత్రిమత్వం.. చిన్నపిల్లలతోనూ ఒకప్పుడు మనం వద్దని తరిమేసిన మేజువాణీలనే భోగం డాన్సులను మించిపోయేలా జుగుప్సగొల్పే నృత్యాలు చేయించడం.. వాటిని ఆకాశానికెత్తుతూ న్యాయమూర్తులైన ప్రముఖులు మాట్లాడ్డం... వాటి కాన్సెప్ట్‌లోనే అసభ్యత పుష్కలంగా వుంటుంది. అదిగాక పోటీలో విజేతలను నిర్ణయించే తీరు., చేసే వ్యాఖ్యలు... కావాలని

టీవీ ప్రభావం అపారం

టీవీ జీవితాన్ని దృశ్యమానం చేసింది. అది వినోద సాధనమే కాదు, సమాచార సాధనమే కాదు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పార్శ్వాలన్నింటినీ ఒక్క దెబ్బలో సమన్వయ పర్చగలిగిన ఇలాంటి అపురూప సాధనం ఏదీ ఇంతకు ముందు మనుషులకు అందుబాటులో లేదు. టీవీ చూడాలంటే ఏక కాలంలో మన కళ్లు, చెవులు కూడా పనిచేయాలి. ఏది ఎంత వరకు స్వీకరించాలి, ఏది అట్టిపెట్టుకోవాలి, ఏది తోసిపుచ్చాలి అని విశ్లేషించుకోవడానికి మెదడుకు వ్యవధి కావాలి కాని అది అన్ని వేళలా సాధ్యం కాకపోవచ్చు. చూసే ప్రేక్షకుల పరిపక్వతను బట్టి అది ఆధారపడి వుంటుంది. అన్ని వయస్సుల వారు కలసి చూసే పరిస్థి తిలో ఇది మరింత సత్యం. సమస్య ఏమిటంటే చూసే వారిపైనే కాదు, పాల్గొనే వారిపైన కూడా టీవీ కార్యక్రమాల ప్రభావం చాలా ఎక్కువగా వుంటుంది. అందుకే అది అన్ని విధాల మనుషుల భావోద్వేగాలతో ముడిపడిన వేల కోట్ల రూపాయల వ్యాపారం. సామాజిక కళాత్మక కార్యక్రమంగా కనిపిస్తుంటుంది. కనుక పూర్తిగా వ్యాపారం అనడానికి కూడా వుండదు. సమాచార సంబంధమైన విధి నిర్వహణగా అనిపిస్తుంటుంది. కాని.. ఆ క్రమంలో మన కష్టసుఖాలూ, బాధలూ భావనలూ, ప్రేమలు, చావులూ, హత్యలూ, భక్తి, రక్తి అన్నీ బహిరంగ విన్యాసాలుగా మారిపోతు ంటాయి. ఎప్పుడైతే బహిరంగ వ్యవహారాల య్యాయో అప్పుడు వాటిని మరింత బాగా కనిపించేలా చేసే కృత్రిమత్వం చొరబడుతుంది. జీడిపాకం సీరియల్స్‌లో ఒకప్పటి పాత సెంటిమెంట్లు గుప్పిస్తున్న తీరు సరే సరి. బహు భార్యత్వం, కుటుంబాలలో కుళ్లు కుతంత్రాలే. అసూయా ద్వేషాలూ, మూఢ నమ్మకాలు, దయ్యాలూ భూతాలూ లెక్కకు మిక్కుటంగా వీటిలో కనిపిస్తూనే వుంటాయి. టీవీ ఛానళ్లలో ఎక్కువ సమయం ఆక్రమించేది లైవ్ షోలు, టాక్ షోలు, స్పాన్సర్డ్ పోటీలు, వివిధ రకాల ప్రత్యక్ష ప్రసారాలు, క్రైం కథనాలు వగైరా వుంటాయి. ఇవి కల్పిత కథలను మించి మనస్సులపై ప్రభావం చూపిస్తుంటాయి.

ఇదేం తీరు

లండన్‌లో రియాల్టీ షో సందర్భంలో శిల్పాశెట్టి జేడ్ గుడి వివాదం ప్రపంచ వ్యాపిత చర్చనీయాంశమై పోయింది. సెలబ్రిటీలందరినీ ఒకచోట చేర్చి తాళం వేసి.. వాళ్లు పళ్లు తోముకోడం దగ్గర నుంచి అన్నం తినడం వరకూ అన్నీ చూపించేదే ఆ షో. దాంట్లో జేడ్ గుడి మాటల్లో జాతి దురహంకారం తొంగిచూసింది. అది వివాదస్పదమైంది. తర్వాత విచారకరంగా జేడ్ గుడీకి క్యాన్సర్ సోకింది. ఆమె తన ఆఖరి క్షణాలను కూడా టీవీ లైవ్ టెలికాస్ట్ హక్కులకు అమ్మేసుకుంది. తన పిల్లల కోసం ఇదంతా చేసినట్టు చెప్పినా దాని వెనక సత్యం ఉద్వేగ వ్యాపారమే.

వివాదాలు ఆహ్వానించడం, వారి కోపతాపాలను చూపించడం, న్యాయమూర్తులను తిట్టించడం.. గెలుపు ఓటములపై తీవ్రమైన సంగీతంతో మార్చి మార్చి చూపించడం... అంతా ఉద్వేగ వ్యాపారమే! సభ్యమైన పాటలతో సాగే సంగీత పోటీలోనూ ఇదే ధోరణి. చిన్న పిల్లలా పెద్దలా అన్నదానితో నిమిత్తం లేకుండా పాడిన వారిపై పొడుగాటి విశ్లేషణలు.. వూకదంపుళ్లు.. ఆ పైన మార్కుల ప్రకటన.. విజేతల ఎంపిక.. దానికి ముందు వారి అంచనాలపై ప్రశ్నల ప్రహసనం. ఎలిమినేట్ అయితే ఏదో కొంప మునిగిపోతుందన్నట్టు పెద్ద పెద్ద డైలాగులు.. వారికి ఏదో పెద్ద జీవిత సమస్యలా ఉద్బోధలు... విషాద గంభీర శబ్దాలు.... ముఖ కవళికలను క్లోజప్‌లో చూపించడం, వారు ఎంత ఉత్కంఠతో వూపిరి బిగబట్టి వుంటే అంత గొప్ప అన్నట్టు చిత్రించడం... ఫలితాల ప్రకటన తర్వాత వారిలో కొందరు కన్నీరు మున్నీరు కావడం.. వారితో పాటు న్యాయమూర్తులలోనూ విషాద భావనలు.. ఎంతో అసహజంగా అనవసరంగా జరిగే ఈ తతంగాన్ని టీవీ ఛానెళ్లు అనివార్యమైనదిగా చేశాయి. పునర్జన్మలపైన కూడా సెలబ్రెటీలు పాల్గొని షోలు నడిపిస్తుంటే ఏం చెప్పాలి? పత్రికలతో పోలిస్తే మూఢ నమ్మకాలను దొంగ స్వాములను ఎండగట్టడంలో టీవీ మీడియా మంచి పాత్ర వహించింది. కాని స్వభావ సిద్ధంగానే అది భక్తిప్రపత్తులకు ప్రచారక సాధనమవుతుంది.

ఉద్వేగ వ్యాపారానికి పరాకాష్ట

చదవడానికి చూడటానికి చాలా తేడా వుంటుంది. ఏదైనా చూస్తే బావుండాలన్నది మీడియా అంతస్సూత్రం. అంటే వేడి పెంచాలి. గరం గరంగా వుండాలి. సమగ్రత కన్నా సంవాద శీలత ముఖ్యం. కోట్ల ఖర్చుతో నడిచే మీడియా స్వభావం కూడా ప్రజల విజ్ఞానం పెంచడం కాదు, కాలక్షేపం చేయించడమే. అన్ని చూపించినట్టు వుండాలి, కాని అసలైన సారాంశం అందకూడదు. బహుశా ఈ ఉద్వేగ వ్యాపారానికి పరాకాష్ట అనదగ్గది కొంతకాలం కిందట వచ్చిన 'సచ్ కా సామ్‌నా' అన్న రియాల్టీ షో. భార్యా భర్తలను పిలిపించి వారి మనసులో మాట చెప్పించడం. ఆ పైన దాన్ని సత్యశోధన యంత్రంతో పరీక్షించడం.. మరీ ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాల గురించి మాట్లాడించి, అది నిజమో కాదో పరీక్షించడం.. ఈ ఫలితాలు వెనువెంటనే వెల్లడవుతుంటాయి. దీనిపైన ఎంత విమర్శ వచ్చిందంటే ఈ కార్యక్రమాన్ని వెంటనే నిలుపుదల చేయించాలని సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఆ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఆసక్తికరమైన వ్యాఖ్యలే చేసింది. ఇలాంటి



కార్యక్రమాలు చాలా అభ్యంతరకరమైనవని అభిప్రాయపడుతూనే నిషేధం అవసరం లేదని చెప్పింది. మంచి చెడ్డలు నిర్ణయించుకోగల విచక్షణ మన ప్రజానీకానికి వుందన్న విశ్వాసం వ్యక్తం చేసింది.

తెలుగు ఛానళ్ల షోలు

తెలుగు ఛానళ్లలో ఈటీవీలో జయప్రదంగా సుదీర్ఘకాలంగా నడుస్తున్న ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం పాటల కార్యక్రమం పాడుతా తీయగా చల్లగా.. ఇందులో వివాదాలు వుండవు. అశ్లీల వ్యాఖ్యలూ వుండవు. కాని ఉద్వేగాలు కనిపిస్తుంటాయి. బాలు చాలా సార్లు తన అనుభవాలు చెబుతూ కదలిపోతుంటారు. వచ్చిన గెస్టులు కూడా కన్నీరు మున్నీరవుతుంటారు. ఇక విజేతల తల్లిదండ్రుల ఆనంద బాష్పాలు పరాజితుల కన్నీళ్లు.. కొన్నిసార్లు వారిని ఓదార్చడం ఇదంతా ఒక తతంగం. అయితే వీలైనంత వరకూ బాలు వాటిని వారిస్తుంటారు.

మరో మరీ విజయవంతమైన షో జబర్దస్త్ ఖతర్నాక్ కామెడీ షో. ఒక విధంగా ఇది బుల్లితెరపై విపరీత హాస్య నాటికల టిట్‌బిట్స్ ప్రదర్శన. అందులో పాల్గొనే యువకుల్లో అత్యధికులు చాలా సమర్థులూ సమయస్ఫూర్తి కలవారవడంతో నవ్వులు పండుతుంటాయి. అయితే ఇందుకోసం బూతులు కూడా ధారాళంగా వాడేస్తుంటారు. వాటిపై అభ్యంతరం చెబుతున్నట్టుగానే ఆస్వాదిస్తుంటారు జడ్జీలు. ఈ షోలో విశేషమేమంటే జీవితంలో ముఖ్యంగా సినిమా రంగంలో పాత్రలను అనుకరిస్తూ అపహాస్యం చేయడం. ఇకపోతే స్త్రీ పాత్రలు కూడా అబ్బాయిలే వేయడం వల్ల చూడ్డానికి ఎబ్బెట్టుగా వుండటమే గాక వినడానికి ఎబ్బెట్టుగా వుండే డైలాగులు కూడా దొర్లిపోతుంటాయి.

బడుగు జీవితాలే టార్గెట్

బతుకు జట్కాబండి, రచ్చబండ వంటి రియాల్టీ షోలు ప్రసారమవుతున్నాయి. ఎక్కువ భాగం భార్యాభర్తల సమస్యలు, వివాహేతర సంబంధాల సమస్యలను చర్చిస్తుంటాయి. కింది తరగతి ప్రజలు, శ్రమజీవులు ఇందులో మనకు కనిపిస్తారు. సుమలత లేదా రోజా, జీవిత వంటి తారలు వారి సమస్యలు చర్చిస్తుంటారు. ఈ సందర్భంగా కొన్నిసార్లు శ్రుతి మించి పోతుంటుంది. బూతులు తిడితే సైలెంట్ చేస్తారు. వచ్చేది పేదలే కాబట్టి హెూస్ట్‌గా వున్న వారు కొందరు ఇష్టానుసారం తిట్టేస్తుంటారు. వాడరాని పదాలు కూడా వాడుతుంటారు. ఇంతకంటే వందరెట్లు ఘోరాలు నేరాలు చేసే కులీన వర్గాల వ్యవహారాలు ఎప్పుడూ ఈ రియాల్టీల పరిధిలోకి రావు. ఉదాహరణకు ఇటీవల దేశంలో సంచలనం కలిగించిన షీలా బోరా హత్య ఉదంతానికి కారకురాలైన ఆమె తల్లి... సవతి తండ్రి స్వయానా టీవీ సంచాలకులు కావడం విశేషం.

తెలుగులోనూ ఇలాంటి షోలకు ప్రసిద్ధి గాంచిన నటీనటులు ఆత్మహత్యా ప్రయత్నాలు చేయడం లేదా వివాదాల్లో చిక్కి బయటపడటం చూశాం.

మన దేశంలో ఏడాదికి రెండు వేల కోట్ల రూపాయల మేరకు వ్యాపార ప్రకటనలు వస్తుంటాయి. ఎన్ని చెప్పినా టీవీ మీడియాకు అవే ప్రాణాధారం. అడ్వర్టయిజర్లకు కావలసింది జనాన్ని అలరించే కార్యక్రమాలే గాని ఆలోచింపచేసేవి కావు. అదే సమయంలో కీలకమైన అంశాలను అందించినట్టుగా కనిపించాలంటే కృత్రిమమైన అంశాలతో ప్రేక్షకులు ఉద్వేగాలను ఆకట్టుకోవాలి. వ్యాపార ప్రకటనల సంగతి చెప్పనే అవసరం లేదు. అంద చందాలు ఆకర్షణలే

2000 కోట్ల వ్యాపారం ఒత్తిళ్లెన్నో!

సర్వస్వమైనట్టు విలాసమూ వినియోగమే జీవితమైనట్టు చెప్పడానికి తారాతోరణంతో క్షణికమైన చిట్కా యాడ్లు ముంచెత్తుతుంటాయి. వీటిలోనూ స్త్రీలను చులకనగా చూపించడమే సర్వసాధారణం. తల్లిదండ్రుల ప్రేమనూ, దాంపత్య జీవితాన్ని, పిల్లల తెలివిని, యవ్వనాకర్షణనూ, ప్రతిదాన్ని వస్తు జాలం చుట్టూ తిప్పే మాయా లోకం ఇది. వాటిని చూసి మతి పోగొట్టుకోవాలంటే ప్రేక్షకుల మెదళ్లు ఖాళీగా వుండాలి. కాలక్షేపం తప్ప ఆలోచన రాకూడదు. కఠోర జీవిత వాస్తవాల నుంచి పలాయనానికి దోహదం చేసే మిథ్యా ఉద్వేగాలలో ముంచి తేల్చడమే. దీనివల్ల కలిగే నష్టాలు దుష్ప్రభావాలు చాలా వున్నాయి.

చిన్నారులతో వెకిలి వేషాలు

రియాల్టీ షోల పేరిట పసికందులతో వికృత నృత్యాలు చేయించడం 2010లో తీవ్ర నిరసనకు దారి తీసింది. దీనిపై సామాజిక చైతన్య జీవులు ఒక వైపున ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తుంటే మరో వైపున అది మానవ హక్కులకు భంగకరమంటూ సదరు నృత్యాల సంధాన కర్తలు రభస చేయడం ఉద్రిక్తత పెంచింది. పిల్లల ప్రతిభను కొల్లగొడుతున్న పిశాచ కాండ తమది కాగా దాన్ని ఎత్తి చూపిన వారు నేరస్థులైనట్టు చిత్రించడం తలకిందులు తర్కానికి గొప్ప ఉదాహరణ! ఈ సందర్భంలో వారు ఉపయోగించిన భాష కొన్ని పదాలు, చేష్టలు చెప్పలేనంత ఘోరంగా వున్నాయి. పిల్లల తల్లిదండ్రుల పేరిట ఈ తతంగం జరిగినా వాస్తవంలో ఈ వికృత కాండ నిర్వాహకులూ, ప్రాయోజకులూ వారి వెంట వుంటారన్నది బహిరంగ రహస్యం. అందుకే వారికి అంత ప్రచారం లభించింది. ఈ క్రమంలో ఈ వికృతాలను విమర్శించిన మహిళా కార్యకర్తలపై దాడి కూడా జరిగింది. పిల్లలతో పాటలు పాడించడం, నృత్యాలు చేయించడం తప్పు కాదు. పోటీలలో పాల్గొనడం వల్ల వారి ప్రతిభ పదునెక్కుతుంది కూడా.. అయితే పోటీ అన్నది వెర్రి తలలు వేయకూడదు. అసభ్యతలో పోటీ అసలే అనుమతించరానిది. ఈ రియాల్టీ షోలలో తరచూ వెకిలి కురచ దుస్తులూ మామూలుగా ఉపయోగించిన పదాలు మాటలూ సంజ్ఞలూ చూస్తుంటాము. ఇందులో యువతీ యువకులు క్లబ్బు డాన్సులను పోటీ పడి చూపిస్తుంటే, సవాళ్లు ప్రతిసవాళ్లతో చెలరేగిపోతుంటే ఒకప్పటి వేశ్యా నృత్యాలను మించి పోతున్నాయి. దానికి మళ్లీ న్యాయమూర్తులు, తీర్పులూ, సవాళ్లూ ప్రతి సవాళ్లూ అంతా కళ పేరిట జరిగే అపహాస్యమే. అందులోనూ మాటలు.. అనవసరమైన మాటలు.. ప్రగల్భాలూ.. కక్షగొండి మాటలూ.. చాలా చాలా... ఈ ఉద్వేగాలకు తోడు భరించలేని స్థాయిలో అసభ్యత. వయోజనుల విషయమే అనుకుంటే క్రమేణా ఇది పిల్లలకూ పాకింది. చిన్న వయస్సులో బాగా రాణించిన చిన్నారులను చూస్తే ముద్దేస్తుంది. కాని వీటిని నడిపే తీరులో వారిని ముదుర్లుగా చేసేసి మురికి చిందులు వేయిస్తున్నారు. ముసలి తాతలు ఫ్లైయింగ్ కిస్సులు విసురుతూ వాతావరణాన్ని కలుషితం చేస్తుంటారు. ఆ పిల్లల వయసును పట్టించుకోకుండా న్యాయమూర్తులుగా వచ్చినవారు ఏవేవో అప్రస్తుతమైన విషయాలతో కాలహరణం చేసి సహనాన్ని పరీక్షిస్తుంటారు.



జేడ్ గూడి

శిల్పా శెట్టి

ఇదంతా ఒక వలయం.

ఈ క్రమంలోనే ఇటీవల నటి జీవిత కార్యదర్శి రియాల్టీ షోకు వచ్చేవారిని బెదిరించి ఏదో బలవంతపు పరిష్కారం కుదిర్చేందుకు ప్రయత్నించారని కేసు నమోదైంది కూడా.

ఉబుసుపోక పోకడలు

ఈ మధ్య కాలంలో ఈటీవీ ప్లస్‌లో యువతను ఆకర్షించేందుకు పెట్టిన కార్యక్రమంలో అనేక వెర్రి వేషాలు కనిపిస్తున్నాయి. అర్థంలేని టాపిక్ ఇచ్చి పూరించమని చెప్పడం, ప్రేమ సంజ్ఞలు చేయడం, పచ్చిగా మాట్లాడించడం హాస్యంగా చలామణి అయిపోతున్నది. ఏమంటే కుర్రాళ్ల సరదా అని తక్కున సమాధానం చెప్పేస్తారు. గృహిణులకు ఉబుసుపోక పోటీలు పెట్టి ఏవో కబుర్లతో అలరిస్తూ కాలక్షేపం జరిగిపోతుంటుంది. మరికొన్ని చోట్లనైతే సెలబ్రెటీలను రప్పించి వారి సినిమాల ప్రమోషన్ కలగలిపి ఏదో షో చేసేస్తుంటారు.

రియాల్టీ షో కెవ్వు కబడ్డీ అట. కబడ్డీకి కెవ్వు కేకకు సంబంధం ఏమిటంటే మాస్ మసాలా మంత్రమే! ఇంకో నటుడు అత్తా కోడళ్లందరినీ ఒకచోటకు చేర్పించి వారి మధ్య ఏవో పోటీలు నడిపిస్తాడు. ఈ సందర్భంలోనూ భాష పదజాలం చాలాసార్లు హద్దు మీరుతుంటుంది. అయితే అవతలివారు పట్టించుకున్నట్టు కనిపించదు. పైగా వీళ్లు కూడా తెలివిగా మార్చేస్తుంటారు.

కుటుంబాలపైనే వల

మీడియా కార్యక్రమాలకు పిల్లలే పెద్ద లక్ష్యాలు. ఎందుకంటే వస్తు సంస్కృతి చిన్నప్పటి నుంచే అలవాటు చేస్తే తర్వాత అమ్మకాలు గ్యారంటీ. నెలల పిల్లలు కూడా వ్యాపార ప్రకటనలను గుర్తించగలుగుతారని పరిశోధనల్లో తేల్చారు. పిల్లలను భయపెట్టడం ఆకర్షించడం కూడా తేలిక. తద్వారా కొన్ని తరాల భావి ప్రేక్షక సముదాయం లభిస్తుంది. వాస్తవానికి టీవీ కార్యక్రమాలతో పిల్లలు సున్నితత్వం కోల్పోతున్నారని బాలల వైద్యులు హెచ్చరిస్తున్నారు. వారికి హింస, రక్తం అన్నవి సర్వసాధారణమై పోతున్నాయి. దేనికి చలించని 'పిల్ల రాక్షసుల్లా' తయారవుతున్నారట. టెలీ-అడిక్షన్ అన్నది పెద్ద వ్యాధిలా మారుతున్నది. శక్తిమాన్‌లా స్పైడర్ మ్యాన్‌లా వూహించుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నవారూ వున్నారు. ఇక తర్వాత లక్ష్యం స్త్రీలు. స్త్రీలంటే ఆలోచనా శక్తి లేని వారైనట్టు బంగారం లేదా పట్టుచీరలు తప్ప వారికేమీ పట్టదన్నట్టు చేస్తుంటారు. అంతకంటే కూడా - పాశ్చాత్య దేశాలలో వలె డాన్సులు చేయించడం స్టెప్పులు వేయించడం కొన్నిసార్లు భార్యాభర్తలను టీవీ తెరపై సరస సల్లాపాలు చేయించడం అలవాటు చేస్తున్నారు. సినిమా ఫక్కీకి మరలుస్తున్నారు. పోటీలలో పాల్గొన్నప్పుడు హుందాగా ప్రవర్తించడం గాక కేకలు, ఈలలు, ఏడుపులు, పెడబొబ్బలు పెట్టడం అలవరుస్తున్నారు. ఆనంద బాష్పాలైనా అశ్రు ధారలైనా వాటికవే రావాలి గాని ప్రదర్శన కోసం అన్నప్పుడు అసహజత్వం అనివార్యమవుతుంది. ఆ అసహజతే సహజత్వమై పోవడం ఇక్కడ మరీ విషాదం. ఉత్తేజం పొందే సందర్భాలు ప్రేరణ ఇచ్చే కార్యక్రమాలు వున్నా ఎక్కువ భాగం పెడమార్గం పట్టిస్తున్నాయనేది పరిశోధనల సారం. ముఖ్యంగా పిల్లలను. అందుకే వీటిపట్ల అప్రమత్తత విమర్శనాత్మకత అవసరం. తీసేవారిలోనే గాక చూసే తలిదండ్రుల్లోనూ అవసరం.

✦

గాల్లో తేలినట్టుందే..



ఈ కుర్చీలో నడుం వాలిస్తే గాల్లో, మేఘాల్లో తేలినట్టుందే అంటారట. ది ఎలీసియమ్ చెయిర్‌గా పేరు పెట్టిన ఈ కుర్చీని కార్బన్ ఫైబర్ స్కెలెటెన్‌తో, ఎలక్ట్రానిక్ జాయింట్లు, బేరింగ్‌లతో రూపొందించారు. అందులో కూర్చునే వ్యక్తి బరువు కోల్పోయిన భావనకు లోనవుతాడని రూపకర్త డాక్టర్ డేవిడ్ వికెట్ చెబుతున్నాడు. బయో ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేసిన ఈ బ్రిటిష్ ఆవిష్కర్త ఫర్నీచర్ డిజైనర్ కూడా. పదేళ్ల పాటు పరిశోధించి ఓ విషయం తెలుసుకున్నాడు. మనం కూర్చునే భంగిమకు గురుత్వాకర్షణ బలానికి మధ్య ఓ సమీకరణ రాబట్టి ఈ ఎలీసియమ్ చెయిర్‌ను రూపొందించాడు. వాలిపోవడానికి, కూర్చోవడానికి మధ్య ఓ స్పాట్ వద్ద మన శరీరం బరువు అంతటా ఒకేలా పంచుకుని జీరో గ్రావిటీని దాటుతుందట. అదే అతి సౌకర్యవంతమైన భంగిమ అని వెన్ను మీద అతి తక్కువ ఒత్తిడిని ఉంచుతుందని డేవిడ్ వికెట్ గుట్టు విప్పాడు. దాదాపు పద్నాలుగు లక్షల రూపాయల ఖరీదు చేసే ఈ కుర్చీలో మోటార్లు, కేబుళ్లు, స్ప్రింగ్ మెకానిజమ్‌లు ఏవీ ఉండవు. గణిత శాస్త్ర ఆధారంగా చేసుకున్న ఇంటెల్లిజెంట్ డిజైన్ ద్వారా దీన్ని రూపొందించారు. ఇప్పటికే 20కు పైగా కుర్చీలు అమ్ముడుపోయాయట. శరీర కదలికలకు అనుగుణంగా సర్దుబాటయ్యే ఈ కుర్చీని కేవలం అరచేతిని గాల్లో ఊపి మామూలు స్థితికి వచ్చేయొచ్చు.

వింత లోకం

48 ఏళ్ల అమ్మాయి

అవునండీ!

ఈ చిత్రంలో ఉన్న కొరియన్ లీ సు జిన్‌కు 48 ఏళ్లంట. కానీ చూడ్డానికి 29 ఏళ్ల అమ్మాయిలా కనిపిస్తోంది కదూ. కొందరికైతే ఇంకా చిన్న వయస్సు అమ్మాయిగా అనిపిస్తోందట. కొందరికి వయసు రాదంటే ఇదేనేమో. దంత వైద్యురాలిగా 16 ఏళ్ల నుంచి వృత్తిలో ఉన్న లీకి ఇద్దరు ఆడ పిల్లలు కూడా ఉన్నారు. పెద్దమ్మాయి కాలేజీకి కూడా వెళుతోంది. ఆ అమ్మాయి వల్లే లీ వయస్సు మ్యాజిక్ గురించి తెలిసింది. పెద్దమ్మాయి కాలేజీకి వెళుతున్న దగ్గర నుంచి లీతో సరిగా మాట్లాడటం లేదట. అప్పటి వరకు మంచి మిత్రుల్లా ఉండే ఆ తల్లీకూతుళ్ల మధ్య ఈ గ్యాప్ చాలా ఇబ్బంది పెట్టేసింది. లీ యేమో ఒంటరితనానికి గురైందట. అప్పటి నుంచి సెల్ఫీలు తీసుకుంటూ రిలాక్స్ అయ్యేది. తాను దిగిన సెల్ఫీల్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టడంతో ఫ్యాన్ ఫాలోయింగ్ అమాంతం పెరిగిపోయింది. ఆ తర్వాత కొన్నాళ్లకు సెలబ్రెటీ స్టేటస్ వచ్చేశాక ఆమె వయస్సు మీద చర్చ మొదలైంది. అప్పుడు ఓ టీవీ కార్యక్రమంలో తన వయస్సు 48 అని చెప్పేసరికి అందరూ షాక్ తిన్నారు. నిజమో కాదోనని పది సార్లు ఆమె పెట్టిన చిత్రాల్ని

చూసుకున్నారు. కొరియాలో ప్లాస్టిక్, సర్జరీలు ఎక్కువే కానీ వాటి ప్రభావం ఓ వయసుకే పరిమితం. కానీ ఇలా 50లకు దగ్గర పడినా కూడా ఇంకా కాలేజీ గోయర్‌లా కనిపిస్తున్న లీని చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు. ముఖమే కాదు శరీరతీరు కూడా అలానే ఉంటుంది.

మెమొరీ కాప్

యూకేకు చెందిన పోలీస్ అధికారి ఆండీ పోప్‌కు నేరగాళ్లు కనిపించడానికి భయపడతారు. ఇతనేమీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ కాదు గానీ నేరగాళ్లను గుర్తుపట్టడంలో స్పెషలిస్ట్. నాలుగేళ్లలో 850 మంది నేరగాళ్ల, నిందితుల ముఖాల్ని గుర్తుంచుకుని వీధుల్లో చటుక్కున పట్టేసుకున్నాడట. మెమొరీ కాప్‌గా పేరొందిన ఆండీకి ఫొటోగ్రాఫిక్ మెమొరీ చాలా ఎక్కువ. ప్రతి రోజు స్టేషన్‌కు ఓ అరగంట ముందే చేరుకుని కంప్యూటర్‌లోని నిందితులు, నేరగాళ్ల జాబితాను, ఫొటోలను కళ్లతో స్కాన్ చేస్తాడట. ఆ తర్వాత ఫీల్డ్‌కెళ్లి వీధుల్లో, పబ్లిక్ పాయింట్లలో పాట్రోల్ చేస్తుంటాడు. ఎంతమందిలో ఉన్నా ఎంత విభిన్నమైన గెటప్పుతో ఉన్నా నేరగాళ్లను గుర్తుపట్టేస్తాడు. ఏ మాత్రం తడబడకుండా బేడీలు వేయించేస్తాడు. 2008లో వెస్ట్ మిడ్‌ల్యాండ్స్ పోలీస్ విభాగంలో చేరినప్పటి నుంచి ఇలానే చేస్తున్నాడు. అతడి బుర్రలో నమోదైన ముఖాలు ఏ ఏటికాయేడు పెరిగిపోతున్నాయి. అయినా సరే ఫొటోలు పోల్చుకోడానికి ఎంత కష్టంగా ఉన్నా సీసీటీవీ ఫుటేజ్ స్పష్టంగా లేకున్నా ముఖంలోని చిన్న పుట్టు మచ్చను చూసి గుర్తుపట్టేసేంత మెమొరీ ఆండీది. ముఖంలోని ఏదో ఒక వైవిధ్యం ఎలానో తన బుర్రలో రిజిస్టర్ అయ్యి ఆ తర్వాత వారిని చూశాక కేసు టక్కున గుర్తొచ్చేస్తుందట. అది ఎంత తేలిగ్గా అంటే ఫొటోల్ని జస్ట్ అలా చూసినా రిజిస్టరైపోతాయట. అంతా ఓకే గానీ ఓ విషయంలో మాత్రం తనకన్నా తన భార్యే బెస్ట్ అట. ఎంత మంది ముఖాల్ని గుర్తుపట్టుకోగలిగినా భార్య పుట్టిన రోజు, పెళ్లి రోజుల్ని మర్చిపోతుంటాడట. ఈ సమస్య అందరికీ ఉన్నట్టుందే..!



కబడ్డీ ఆట ఓ యువకుడికి జీవితాన్నిచ్చింది. నేవీలో ఉద్యోగం, అంతర్జాతీయ జట్టులో స్థానం ఇలా అన్ని ఆ ఆట మహిమ వలనే వచ్చాయి. కబడ్డీలో ఎటువంటి సౌకర్యాలు లేని ఊరిలో సీనియర్ ఆటగాళ్లు ఇచ్చిన స్ఫూర్తిదాయకమైన మెళకువలతో తన కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నాడు. ఉన్నతంగా ఎదిగాడు. ప్రొ కబడ్డీలో ఎటువంటి అంచనాల్లేని పాట్నా పైరేట్స్ మూడో సీజన్‌లో టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 12 మ్యాచ్‌ల్లో 102 పాయింట్లను ఒంటి చేత్తో జట్టుకు అందించి మోస్ట్ వేల్యబుల్ ప్లేయర్‌గా నిలిచాడు. అతడే హర్యానా ప్రొ కబడ్డీ ప్లేయర్ రోహిత్ కుమార్. పట్టుమని మూడు పదులు లేని వయస్సులోనే కబడ్డీ కూతతో సీనియర్ ఆటగాళ్ల సరసన చేరిపోయాడు.

కబడ్డీలో రో..హిట్

అప్పటి వరకు కబడ్డీ అంటే రైల్వేలకో, సర్వీసెస్‌కో ప్రాతినిధ్యం వహిస్తే చాలు అనుకునే గ్రామీణ క్రీడాకారుడు రోహిత్. సాంప్రదాయబద్ధమైన కబడ్డీలో రాణిస్తూ స్టార్ ఆటగాడిగా ఎదిగాడు 26 ఏళ్ల రోహిత్ కుమార్. 1990 జనవరి 19న హర్యానా రాష్ట్రంలోని నిజాంపూర్‌లో జన్మించాడు. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతంలో ఉండే ఆ గ్రామంలో దేశవాళీ ఆట అయిన కబడ్డీకి ఆదరణ ఉండేది. అది ఎంతంటే దేశమంతా క్రికెట్‌ను ఆరాధిస్తే ఇక్కడ కబడ్డీ అంటే ప్రాణం పెడతారు. జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినా రాకున్నా, అంతర్జాతీయ వేదికల్లో మెరిసినా మెరవకున్నా, సెలబ్రెటీ క్రీడాకారుడి హోదా రాకున్నా కూడా కబడ్డీని కాపాడుకున్నారు. మరో రకంగా ఈ ఆట వారికి నేవీ, పోలీస్ వంటి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను ఇప్పించేది. అయితే అది గల్లీ స్థాయి నుంచి ఢిల్లీ స్థాయికి చేరేందుకు రోహిత్ కుమార్, మంజిత్ చిల్లర్ లాంటి ఆటగాళ్లే కారణం. ఇద్దరూ నిజాంపూర్ నుంచే క్రీడ ప్రస్థానం మొదలెట్టి ప్రొ-కబడ్డీ లీగుల్లో కీలక ఆటగాళ్లుగా ఎదిగారు. రోహిత్ తొలుత ఆసక్తి ట్రెక్కింగ్ కాగా అనూహ్యంగా కబడ్డీలోకి ప్రవేశించడంతో తన జీవితమే మారిపోయింది. రోహిత్ తండ్రి కబడ్డీ ఆటగాడు. జాతీయ పోటీలకు ఆడాడు. పోలీస్ విభాగంలో బాధ్యతలు నిర్వర్తించాడు. తండ్రిని చూసి

సరదాగానే కబడ్డీ క్షేత్రంలోకి అడుగుపెట్టిన రోహిత్‌కు చివరకు అదే జీవితం అయిపోయింది. దేశవాళీ కబడ్డీ శైలితో పాటు దూకుడుగా సాగే ప్రొ-కబడ్డీ వరకు ప్రతి శైలికి అనుగుణంగా తనకు తానుగా మలుచుకుంది తనింట కబడ్డీ కూత ఆగకూడదనే. తండ్రికది బహుమానంగా, ఊరికి ప్రతిష్ఠగా తన క్రీడా జీవితాన్ని మలుచుకున్నాడు. రోహిత్ చిన్నతనంలో భారత సీనియర్ కబడ్డీ ప్లేయర్స్ మంజిత్ చిల్లర్, రాకేష్ కుమార్‌లు నిజాంపూర్‌లో జూనియర్ ఆటగాళ్లకు ఆటలో నైపుణ్యం ఏ రీతిన సాధించాలన్న విషయంపై అవగాహన కల్పించేందుకు వచ్చారు. కోచ్‌ల కొరత, ఇతర సౌకర్యాల్లేని ఊరిలో వారిచ్చిన సలహాలు, సూచనలు రోహిత్‌లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేశాయి. ఎలాగైనా సరే కబడ్డీలో రాణించాలన్న దృఢ సంకల్పం అతన్ని వెనక్కి తిరిగి చూసుకోని విధంగా ముందుకు నడిపింది. తొలుత గ్రామం తరపున ఆడిన రోహిత్ హర్యానా రాష్ట్రం తరపున స్కూల్ నేషనల్ గేమ్స్, సీనియర్ నేషనల్ గేమ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ప్రత్యర్థి కోర్టులో దిగాడంటే పాయింట్లతోనే తిరిగి వచ్చే విధంగా కబడ్డీలో దుమ్మురేపేవాడు రోహిత్. 2009లో నేవీలో చేరిన రోహిత్‌కు 2011 భారత జట్టులో ఆడేందుకు పిలుపు వచ్చింది. బెంగళూరులో నేషనల్ క్యాంపులో రోహిత్ శిక్షణ పొందాడు.

- ఈశ్వర్ నెట్టెం

అతడి సీజన్ మొదలైంది

కబడ్డీలో తనదైన కూతతో ప్రత్యర్థులను మట్టికరిపించిన రోహిత్ తొలుత సాధారణ ఆటకే పరిమితం అయ్యాడు. తర్వాత దూకుడు ఆటకు తన శైలిని మార్చుకోవడంతో ప్రొ కబడ్డీలో రోహిత్‌కు వేలం పాటలో మంచి ధరే వచ్చింది. 2014 తొలి పికెఎల్‌లో యు ముంబా రూ7.10లక్షల ధరకు చేజిక్కించుకుంది. ప్రొ కబడ్డీ సీజన్ ప్రారంభం కానంత వరకు సాధారణ జీవితాన్నే రోహిత్ గడిపాడు. కేవలం రాష్ట్రం తరపున రైల్వేస్‌కు ఆడితే చాలు అనుకున్న రోహిత్ ప్రొ కబడ్డీలో ఆడే అవకాశం రావడంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు. ఆ తర్వాత రోహిత్ అన్నయ్య మంజిత్ చిల్లర్ పుణేరి పల్టన్ వైపు, రోహిత్ బెంగళూరు బుల్స్ తరపున ప్రొ కబడ్డీకి ప్రాతినిధ్యం వహించారు. అయితే మూడో సీజన్‌లో పట్నా పైరేట్స్ వైపు రోహిత్ కుమార్‌ను భారత్ కబడ్డీ ఫెడరేషన్ పంపింది. తొలిసారిగా ప్రొ కబడ్డీలో పట్నా పైరేట్స్ టైటిల్ సాధనలో రోహిత్ కుమార్ సత్తా చాటాడు. 12 మ్యాచ్‌ల్లో తనదైన శైలిలో ప్రత్యర్థి జట్లపై సింహంలా గర్జించాడు. జట్టు టైటిల్ దిశగా ముందంజ వేసేలా వ్యూహాత్మకంగా కోర్టులో దుమ్మురేపాడు. దక్షిణాసియా క్రీడా పోటీల్లోను భారత్ జట్టు ఎనిమిదో సారి స్వర్ణం కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు.

వివరం



రాక్షస బల్లుల గుడ్ల శిలాజాలు

భార
జూరాసి

మన కోస్తా సీమలోనే ప్రత్యేకమైన రాక్షస బల్లుల జాతి తిరిగాడిందనే వార్త అప్పట్లో పెద్ద సంచలనం, ఆసక్తికర విషయం. అదే కాకుండా ఆదిలాబాద్ ప్రాంతంలో కోటా ఫార్మేషన్‌గా పేరొందిన చోట కోటాఫియాల్బెటిస్ అనే కీటకాల వంటి చిన్ని ప్రాణుల నుంచి కోటాసారస్ అనే భారీ డైనోసార్ వంటి జీవుల శిలాజాల్ని కనుగొన్నారనే మాట. ప్రాణహిత-గోదావరి బేసిన్ భూభాగంలో కూడా 29 కోట్ల ఏళ్ల నాటి శిలాజాలు లభ్యమయ్యాయనే విషయం ఇక్కడి జురాసిక్ ప్రపంచాన్ని తెలియజేస్తుంటాయి. హాలీవుడ్ సినిమాల్లో చూసే డైనోసార్లని లోకల్‌గా కనెక్ట్ చేసుకుంటే ఆ థ్రిల్లే వేరు. ఇక్కడ దొరికిన ఎన్నో శిలాజాలు ఆ విషయాన్ని ధృవపరచడమే కాకుండా శాస్త్ర లోకంలో భారత్ ఉప ఖండానికి ఓ ప్రత్యేక అధ్యాయముందనే విషయాన్ని చెబుతుంటాయి.

– ప్రసిద్ధ్

భూఖండాలన్నీ కలిసిపోయి ఉన్న భూగోళం తొలి రూపమైన పాంజియా కాలం నుంచి అయినా ఈ ఉప ఖండం విలక్షణంగానే కనిపిస్తుంది. సుమారు 19 కోట్ల క్రితం నాటి జురాసిక్ కాలంలో ఆ తర్వాత మిగతా ప్రపంచంతో విడివడిన భూభాగంగా పయనంలోనైనా జంబూ ద్వీపానిదో ప్రత్యేకత. అంత విలక్షణమైన ఈ భూభాగంలో శిలాజాలు కోట్ల ఏళ్ల వెనక్కు తీసుకెళ్లి ఇక్కడే వున్నాయో, దీనికేమైందో చెబుతాయి. అవి కనుమరుగైపోయిన వృక్ష జాతుల విత్తనాలవైనా, ఇప్పటి సినిమాల్లో మిగిలి ఉండిపోయిన రాక్షస బల్లులవైనా. ఇప్పటికీ అంతు తేలని జీవ రాశులవైనా. ఓ రకమైన కాలయంత్రంలా కనిపించే శిలాజాల కేంద్రాలు భారత్‌లో చాలానే ఉన్నాయి. వాటిలో కొన్ని మీ కోసం..

ఝూంస్కార్ లోయ, కాశ్మీర్

ప్రపంచంలో అతి వైవిధ్య సముద్ర జీవరాశుల శిలాజాలకు హిమాలయాల్లోని ఝూంస్కార్ లోయ కేంద్రమంటే అస్సలు నమ్మబుద్ధి కాదు. హిమాలయాల్లో సముద్రమేంటనే ప్రశ్నకు సమాధానం ఒకప్పుడు పాంజియా భూభాగం నుంచి విడివడి దాదాపు రెండు మూడు కోట్ల ఏళ్ల క్రితం యూరేసియా ఫలకాన్ని ఢీకొడుతూ భారత్ ద్వీప భాగం చొచ్చుకుపోయింది. అప్పుడు ఏర్పడ్డవే హిమాలయాలు. ఝూంస్కార్ లోయ ప్రాంతం ఒకప్పుడు సముద్రానికి ఆనుకుని లేదా సముద్రం లోపల ఉండేది. 55 కోట్ల ఏళ్ల క్రితం ట్రైలోబైట్లనే ఆర్థోపాడ్స్ జాతి జీవ రాశులు భూగోళంలోని సముద్రాలన్నింటిలోను ఎక్కువగా ఉండేవి. అవి దాదాపు 15 వేల జాతులకు పైగానే పరిణామం చెందాయి. 25 కోట్ల ఏళ్ల క్రితం దాదాపు అవి కనుమరుగైపోయాయి. అప్పటి జీవ మహా మరణంలో వాటిలో 10 శాతం మాత్రమే మనుగలిగాయి. ఆ కాలానికి చెందిన అవశేషాలు, శిలాజాలు ఝూంస్కార్‌లో బయటపడ్డాయి. దీని వల్లే ఒకప్పుడు హిమాలయ ప్రాంతం టెతీస్ సముద్రం కింద ఉండేదని తేలింది.

వాద్దామ్, మహారాష్ట్ర

భారత్‌లో గుర్తించిన తొలి రాక్షస బల్లి శిలాజం వాద్దామ్‌లోదే. ఈ అటవీ ప్రాంతం గోదావరి బేసిన్‌లో ఉంటుంది. ఇక్కడ డైనోసార్లకు చెందిన ఎన్నో శిలాజాలు బయటపడ్డాయి. వాటిలో పూర్తి శారీరిక నిర్మాణం కలిగిన బారాపాసారస్ అస్థి పంజరం లభ్యమైంది. 1959లో తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో దొరికిన ఈ అస్థిపంజరాన్ని కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ మ్యూజియంలో భద్రపరిచారు. శిలాజాలు దొరుకుతున్న ప్రాంతాన్ని వాద్దామ్ ఫాజిల్ పార్క్‌గా అభివృద్ధి చేసి అందులో సారోపాడ్‌లు ఇతర వృక్షజాతుల జురాసిక్ కాలం నాటి శిలాజాలపై పరిశోధనలు చేస్తున్నారు. ఈ శాఖాహారి భారీ జీవులు అప్పట్లో ఈ భూభాగం మొత్తం కలియతిరిగాయట. ఈ పార్క్ మరో ప్రత్యేకత ఏమిటంటే భారత్‌లో జురాసిక్ కాలం నాటి వృక్ష, జంతు శిలాజాలు బయల్పడిన ఏకైక ప్రాంతమిది.

బాలాసినోర్, గుజరాత్

ఇక్కడి రైయోలీ గ్రామంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఓ సంచలనాత్మకమైన విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. 1981లో ఇక్కడి రాళ్లలో సుమారు 1000 రాక్షస బల్లి గుడ్లు శిలాజరూపంలో దొరికాయి. ఇవి 13 రకాల డైనోసార్ల జాతులకు చెందినవని

పరిశోధనలో తేలింది. ఇక్కడే మరో
బయటపడింది. అదేంటంటే ఈ భు
రాజాసారస్ నార్మాడెనీస్ అనే డైనోస
తేలింది. కొమ్ముతో ఉండే దీని పొడ
ఉండేదట. ఈ విషయాన్ని 2003ల
ప్రపంచంలోనే రాక్షస బల్లుల గుడ్ల
ప్రాంతాల్లో ఇది మూడో స్థానంలో ని
డైనోసార్ల గుడ్లను సైతం తినే అరుదై
ఇండికస్ శిలాజాలు కూడా ఇక్కడ బ
ప్రపంచాన్ని కుదిపేసింది. డైనోసార్ల
జీవుల అరుదైన శిలాజాలిక్కడివే.

మనేంద్రగఢ్, చత్తీస్‌గఢ్

దేశం నడిబొడ్డున సముద్ర జీవుల శిలాజాలు బయల్పడి పరిశోధకులకు సరికొత్త సవాలు విసిరిన శిలాజ కేంద్రమిది. 28 కోట్ల నాటి టల్చీర్‌కు చెందిన పెర్మియన్ శిలలతో పాటు సముద్ర జీవరాశుల శిలాజాలు ఇక్కడ లభించాయి. కోరియా జిల్లాలోని ఈ ప్రాంతంలో కొన్ని కోట్ల ఏళ్ల క్రితం రెండు విరుద్ధ జీవావరణాలకు చెందిన జీవరాశుల కలబోత జరిగిందని అంటారు. 20 కోట్ల ఏళ్ల క్రితం ఇక్కడ సముద్రం ఉండేదని వాటి ద్వారానే తెలిసింది. ద్వికవాట నత్తలు, మి
సముద్ర జీవుల శిలాజాలు దొరికాయి.

సుకేతి, హిమా

నాహన్ భూభాగంలోని మర్కం
ప్రాంతంలో ఉంటుంది సుకేతి శిలా
శ్రేణుల ఏర్పాటు కాలం నాటికి చెంది
శిలాజాలు ఎక్కువగా ఇక్కడ లభ్యమ
యుగానికి చెందిన క్షీరదాలకు సంబ
నిలువెత్తు మాతృకలను ప్రదర్శనల్లో
మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఎ
శిలాజాలను ఇందులో ప్రదర్శనలకు
నిండి ఉండే ఈ ప్రాంతం అదేదో ప

తిరువక్కరాయ్,

12 కోట్ల ఏళ్ల క్రితం నాటి వృక్షా
ప్రాంతమిది. పుదుచ్చేరికి 35 కి.మీ.
సంతనూర్ జాతీయ శిలాజ కేంద్రం
200 శిలాజ చెట్లను గుర్తించా
ఆధారంగా ఒకప్పు
కాలం (స
క్రిత

త్‌లో
క్ పార్క్



పాము శిలాజం పక్కన డైనోసార్ గుడ్ల అవశేషాలు





భారత్‌లో తొలి ఆదిమమానవ ఎముక అవశేషం

బాలాసినోర్ పార్క్ వద్ద రాక్షసబల్లి నిలువెత్తు బొమ్మ

...ద్భుతమైన విషయం
...భాగానికే ప్రత్యేకమైన
...ర్ కూడా తిరిగిందని
... 30 అడుగుల పైనే
... నిర్ధారించారు.
...ఎక్కువగా దొరికిన
...లవడం మరో విశేషం.
...న సర్ప జాతి సానాజే
...యల్పడ్డాయి. ఇది శాస్త్ర
...కన్నా ముందటి వేరే భారీ

...చల్ ప్రదేశ్

...ా నదీ పరీవాహక
... కేంద్రం. శివాలిక్ పర్వత
...న జీవరాశులకు చెందిన
...ర్యాయి. మెసోజోయిక్
...ంధించిన ఫైబర్‌గ్లాస్ ఆరు
...ూడొచ్చు. ఇక్కడే
...ృటికప్పుడు దొరికిన
...ంచుతారు. పరిశోధకులతో
...శోధనశాలగా కనిపిస్తుంది.

...తమిళనాడు

...ల శిలాజాలు బయల్పడిన
... దూరంలో ఉండే
...ందకు వస్తుంది. ఇక్కడ
...ు. ఇక్కడి శిలాజాల
...డు అంటే క్రెటాసియస్
...మారు 6.5 కోట్ల ఏళ్ల
...)లో ఈ భూభాగంలో
...సముద్రం ఉండేదని
తేల్చారు. చెట్ల ఎత్తు
...తా 28 మీటర్లు

ఉంటుందని తేలింది. కానిఫెర్, జిమ్నోస్పెర్మ్, యాంజియోస్పెర్మ్ జాతులకు చెందినవని గుర్తించారు. ఈ శిలాజాల్ని ప్రకృతి ఎంత భద్రంగా కాచిందంటే అడ్డకోతలపై వృత్తాలు, కుమ్మర్ల భాగాలు స్పష్టంగా కనిపిస్తాయి.

హాత్నోరా, మధ్యప్రదేశ్

భారత్‌కు చెందిన తొలి మానవుని అవశేషాలు, శిలాజాలు లభ్యమైన చోటుది. నర్మదా నదీ పరీవాహక ప్రాంతంలోనున్న ఈ భూభాగంలో ఆది మానవుని పుర్రె ఎముక బయల్పడింది. 1982 డిసెంబర్ 5న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వెలుగులోకి తెచ్చిన ఈ విషయం కొత్త అధ్యాయానికి తెరలేపింది. ఆధునిక మానవుని పూర్వీకులైన హొమినిన్ జాతి ఆదిమ మానవునికి చెందిన స్త్రీది ఈ ఎముక అని పరిశోధనల్లో తేలింది. 2012లో మరిన్ని శిలాజాలు హొమినిన్‌లవి దొరికాయి. చేతి పెద్ద ఎముక, తొడ ఎముకల్ని హాత్నోరాకు 3 కి.మీ.ల దూరంలోని నేతాన్‌ఖేరిలో కనుగొన్నారు. వీటితోపాటు రాతి పనిముట్లు కూడా ఇక్కడ బయల్పడ్డాయి. వీటి వల్లే ఇక్కడ మనిషి మనుగడ 8 లక్షల ఏళ్ల క్రితమే ఉందని తెలిసింది.



హాత్నోరాలో పనిముట్లు



వృక్ష శిలాజాలు, తిరువక్కరాయ్



డైనోసార్ పుర్రెభాగం



సుకేతి శిలాజ వనంలోని ఏనుగు అస్థిపంజరం



బాల కార్మికులు

తూనీగల్ని పట్టి ఆటాడించే వయస్సు
చినుకుల్లో చిందులేస్తూ
కాగితం పడవల్ని విడిచే వయస్సు
అమ్మ తలస్నానానికి రమ్మంటే
విడిచిన నిక్కరు వొదిలి వీధిలోకి
పరుగెత్తే బాలచంద్రులు
కళ్లు తెరవని పుణ్యభూమిలో
బాల కార్మికులు!
అడ్డాల నాడే తండ్రి మరణం
తల్లి ఆరోగ్యం రుగ్మతల మయం
తల్లికి తనే తల్లితండ్రయి
నడుస్తున్న చరిత్ర!

జిల్లాల్లో విశ్వవిద్యాలయాలు
మండలాల్లో వైద్య కళాశాలలు
ఊళ్లల్లో ఇంజనీరింగ్ కాలేజీలు
పేట పేటన ఉన్నత విద్యా పాఠశాలలు
వీధి వీధిన ప్రాథమిక బడులు
విద్యను అందుకోలేని మనిషి
మనిషిని అందుకోలేని విద్య
బాల కార్మికుణ్ని చూసి బడి దు:ఖిస్తుంది
బడిని చూసి విద్య నవ్వుతుంది!

నిండు నీటి తొట్లో ప్రతిబింబం చూసి
చేతి వేళ్లతో తల దువ్వుకుని
చినిగిన దుస్తుల్లో శరీరాన్ని కప్పుకుని
బతుకు తెరువుకు బాల కార్మికుడి పయనం!

గాయపడ్డ చేతుల్ని
తల్లి కన్నీరు కడుగుతుంది
అరచేతుల కాన్వాసుపై
కడిగిన పాత్రలు తుడిచిన బల్లలు
మోసిన రాళ్లు కలిపిన సున్నం
మండిన కొలిమి కాల్చిన కర్రులు కనపడతాయి!

మోయలేని భారం మోపెడై
మెడ కుంగినపుడు
చెయ్యాల్సిన పనులు చాంతాడై
నిలిచినపుడు
రెక్కలు ఆడిస్తూ పక్షులు
ఆకాశంలో ఎగురుతుంటే
పక్షి రెక్కల నొప్పులు గుర్తొచ్చి
తన్ను తాను సంబాళించుకుంటాడు!

తల్లి విలపిస్తుంది
బిడ్డ కరిగి పోతున్నందుకు..!

బిడ్డ ఏడుస్తాడు
తల్లి శల్యమైనందుకు......!

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

అక్షరాలు

ఒక్కో అక్షరాన్ని పదాల సేద్యంలో
పదిలంగా వాడుకుంటూ
ప్రజా బాహుళ్యంలో
విరివిగా వాడబడే
భాషలో యాసలో
ప్రజా సమస్యల ప్రతిబింబంలో
కలాన్ని నడిపిస్తూ దారి తప్పితే
హెచ్చరిస్తూ బతిమాలుతూ
బందూకుల్లాంటి పదాల సృష్టిలో
పడే యాతన తపించే గుండె లోతుల్లో
దేవులాడుతూ
జ్వలించే అక్షరాలకై
దారి వెంట అన్వేషిస్తూ
సిరా ప్రవహిస్తుంటే
పాళీ సమరం నిరంతరం
అడ్డంకులను ఎదుర్కుంటూ
నిర్బంధాల ఉచ్చులను తెంపుకుంటూ
వర్గాలను తోసుకుంటూ
కవితా సృష్టికై...

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201



తెలుసా



మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆహారోత్పత్తి విధానాల్ని మార్చుకోవాలనేది ఈ ఏడాది ప్రపంచ ఆహార దినోత్సవ నినాదం.

- 2050 నాటికి 960 కోట్లకు చేరే జనాభా అంతటికీ ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు కృషి చేయాలని ఆహార, వ్యవసాయ సంస్థ కోరుతోంది.
- మొరాకోలోని మర్రాకేలో జరగనున్న క్లైమేట్ చేంజ్ కాన్ఫరెన్స్ కీలక సమయంలో వచ్చిన ప్రపంచ ఆహార దినోత్సవం ద్వారా వాతావరణ మార్పులపైనే దృష్టి సారించారు.
- ఆహారం వ్యర్థమవడం వల్ల మీథేన్ వెలువడుతుంది. ఇది కార్బన్ డై ఆక్సైడ్ కన్నా 25 రెట్లు ప్రమాదకర గ్రీన్ హౌజ్ వాయువు.

జీరో హంగర్
ప్రపంచం కోసం

- ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో మూడో వంతు వృథా అవుతోందని ఇది తీవ్ర సంక్షోభానికి దారి తీస్తుందని ఆందోళన చెందుతోంది. ఏటా దీని స్థాయి 130 కోట్ల టన్నుల పైమాటే. దీన్ని జాగ్రత్త చేయగలిగితే కొన్ని కోట్ల మంది ఆకలిని చల్లార్చొచ్చు.
- సేద్య తీరు దగ్గర నుంచి, నిల్వ చేయడం, ప్యాకింగ్, రవాణా, మౌలిక వసతులు, మార్కెట్ మెకానిజమ్‌లు, న్యాయ, పాలన విధానాల వరకు ప్రతి విషయంలోను మార్పులు చేసుకోవాలని ప్రపంచ దేశాలకు మార్గదర్శకాల్ని ఐరాస అందించింది.
- పాడి పరిశ్రమ, పశుమాంస ఆహారోత్పత్తి ద్వారా 78 శాతం గ్రీన్ హౌజ్ వాయువు వ్యవసాయాధారిత మీథేన్ ఉద్గారాలు వెలువడుతున్నాయని దీన్ని తగ్గించేందుకు ప్రయత్నించాలని ఐరాస కోరుతోంది.





(ప్రపంచ ఆహార దినోత్సవం అక్టోబర్ 16 సందర్భంగా..)



- అంత స్థాయిలో ఆహారోత్పత్తి జరగాలంటే ఇప్పుడు అవలంబిస్తున్న సేద్య విధానాల్ని మార్చు కోవాలని, జీవావరణ వ్యవస్థల్ని కాపాడుకో వాలని, గ్రామీణ జనాభాకు ఆసరాగా నిలవాలని, ఉద్గారాల స్థాయిని తగ్గించాలని నిర్ణయం తీసుకుంది.
- కావాల్సినంత వరకే ఆహారాన్ని కొనుక్కోవడం, సరిగ్గా నిల్వ చేయడం, మొక్కలకు సంబంధించిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఇలాంటి జాగ్రత్తల్ని ప్రతి ఒక్కరూ పాటించాలి.
- 2050 నాటికి వ్యవసాయోత్పత్తి ఇప్పటి కన్నా 60 శాతానికి పెరగకపోతే తీవ్ర ఆహార సంక్షోభం ఎదురౌతుందని ఆకలి యుద్ధాలు చూస్తామని నిపుణులు అంటున్నారు.
- నీటి వృథా అరికట్టడం, ఆహారంలో వైవిధ్యాన్ని ఎంచుకోవడం, ఆర్గానిక్ ఉత్పత్తులను వాడటం వంటి చిన్న చిన్న చర్యలతో పెద్ద మార్పే తేవచ్చు అంటోంది ఐరాస.

- 2050 నాటికి మత్స్యాహారంలో భాగంగా మనం వేటాడుతున్న చేపల సంఖ్య 40 శాతానికి పడిపోతుందని ఇది కోస్తా ప్రాంతాల్లో ఆహార సంక్షోభానికి కారణమవుతుందని హెచ్చరిస్తున్నారు.
- చెట్ల నరికివేత, అటవీ భాగం తరుగుదల 10 శాతానికి పైగా గ్రీన్ హౌజ్ వాయువుల ఉద్గారాలకు కారణాలని తేలింది.
- 2030 నాటికి జీరో హంగర్ స్థితికి చేరాలని ఐరాస ఆకాంక్ష. ఇదేకాదు అసంతులిత ఆహారం వల్ల శిశు మరణాల రేటును, ఆకలి చావులను చూడకూడదని సంకల్పం తీసుకుంది.

జాతిచెట్టుకు వేరుపురుగులు

- ఎల్. రాజాగణేష్
9247483700

రవీంద్రకి తలబొప్పికట్టింది. ఇది ఈ నెల్లో పదోసారి డబ్బులివ్వద్దని ప్రాధేయపడ్తూ వెళ్లడం. ఇదిగో అదిగో ఇవ్వాళ రేపూ అంటున్నాడే కానీ డబ్బులు వసూలవ్వడం లేదు. ఈ రోజుతో పూర్తిగా తెలిసిపోయింది.
తనలాంటోళ్లు వందలాది మందున్నారు? కేసు పోలీస్‌స్టేషనుకెళ్లింది. మనకెందుకమ్మా ఈ చీటీలు? అయినా మన వల్లకాదని ముందేచెప్పేసాడు రవీంద్ర. పొదుపు గురించీ ముందుముందర అవసరాల గురించే ఎన్నెన్నో కబుర్లు చెప్పాడు సుబ్బారావు మావయ్య. మొత్తానికి జిడ్డులా పట్టి అనుకున్నది సాధించాడు. రవీంద్ర అమ్మ నాంచారమ్మ ఆ మాటల్లో మునిగిపోయింది. లక్షరూపాయల చీటి గ్రూపులో చేరింది. నష్టాల్లో పాడేసుకోవడం ఎందుకులే అని ఆఖరి వరకూ ఆగిపోయారు. గట్టిగా దబాయించి అడగలేక ఆఖరికి ఓడిపోయారు.
రవీంద్ర డిగ్రీ వరకూ చదువుకున్నాడు. సరైన ఉద్యోగం దొరకలేదు. గడవడానికి ఏదో ఒకటి చెయ్యాలి కదా! ట్రాన్స్‌పోర్టు ఆఫీసులో గుమస్తాగా చేరిపోయాడు. ప్రయివేటు ఉద్యోగం గొర్రెకు బెత్తెడే తోక. అందినది అమ్మ చేతిలో పెట్టడం. అమ్మ చేసే చిన్నచిన్న పనుల్లో చేదోడుగా పొదుపుగా ఇల్లుగడవడం జరుపుకొస్తుంది. పాపం నోరుకట్టుకుని కూడబెట్టింది కాస్తా ఇలాతగలడింది. రవీంద్ర విచారంగా లోలోనే గొణుక్కుంటూ ఇంటికి నడుస్తున్నాడు.
రవీంద్ర అసహనంతో పోటీపడ్తూ ఎండ తీవ్రంగా కాస్తుంది. ముఖానికి పట్టిన చెమట రుమాల్తో అద్దుకున్నాడు.
"ఏయ్! బాబో.." అన్నారతను.
చూస్తే పెద్దాయన. గంభీరమైన ముఖంతో నవ్వుతూ చూస్తున్నారు.
"ఆగాగవయ్యా! ఆగూ!" అంటూ అడ్డంగా నిలిచారాయన.
"దొంగనాయాళ్లు బాగా పెరిగిపోయారు బాబూ!" మళ్లీ తనే అన్నారు.
అయోమయంగా చూస్తు విన్నాడు రవీంద్ర. అతని మాటలు ఏదో విషయం చెప్పడానికి ముందర ఉపోద్ఘాతంలా ఉన్నాయి.
"విశాఖపట్నంలో మొత్తం బాంకులన్నీ డబ్బుకట్టల్తో నింపేసా. ఇంకా ఏఏ బ్యాంకులు ఖాళీగా ఉన్నాయని చూస్తుంటే అనకాపల్లి భీమిలీ మిగిలాయి. అవీ నింపేద్దామనుకుంటుంటే ఈ అఘాఇత్యం జరిగిపోయింది మరి... " అని దీర్ఘంగా నిట్టూర్చారాయన.
అతని మాటలు విన్న రవీంద్ర 'అయ్యో పాపం' అన్నాడు.
"పాపమని ఊరికే అంటావేంటి బాబూ! ఘోరంగా ఇంకమ్‌టాక్స్ రైడయింది. నాకు చెమట్లు పట్టేసాయి. ఇదిగిదిగో ఇలాగే రోడ్డుపైకి పరుగులెత్తి తిరుగుతున్నాను. ఏం చెయ్యాలో తోచడం లేదు. ..ష్చ్."
రవీంద్రకిప్పుడు పూర్తిగా అర్థమైపోయింది. అర్థంపర్థంలేని మాటలు ఆందోళన ముఖంలో పలు ప్రకంపనలు ద్వంద్వ భావాలు. ఇతడు మెంటల్‌కేసని గ్రహించేట్టు చేసాయి. అతణ్ణి తప్పించుకుందామని చూస్తు కదలబోతూనే అటుఇటూ అసహాయంగా చూసాడు.
"పర్సులో డబ్బులెంతున్నాయేవిటి బాబు?" అన్నాడీసారి తను.
రవీంద్ర సమాధానమివ్వలేదు.
"డబ్బుజేబుల్లో పెట్టుకు తిరక్కండి.

జేబుదొంగలుంటారు. చుట్టూ దొంగలే!! వాళ్లకదేపని! కొట్టేద్దామని చూస్తునే ఉంటారు. సురక్ష.. ధనరక్ష..మీరక్ష.. మీ గంగిగోవు... ప్రజారక్ష...ప్యూరోగోల్డ్..గోల్డెన్ హాండ్స్ ....అని సంస్థలు తెరుస్తారు. డిపాజిట్లు తీసుకుంటారు. చీటీలు వేయిస్తుంటారు. పొదుపు చేసుకోమంటారు. ఆ తర్వాతర్వాత గోవిందా గోవిందా అంతే సంగతులు. గుర్తుంచుకో ఇవేకాదు. దొంగతనాలు దోపిడీలూ భూకబ్జాలూ.. రౌడీఇజం...

ఇలా ఇలా దేశం మొత్తంలో ఎన్నోసార్లు జరిగింది. జరుగుతూనే ఉంది. ఎవరికెవరూ పట్టించుకోరు. మళ్లీమళ్లీ జనాలు నమ్ముతుంటారు."అని కాస్సేపాగారాయన.

"ఇదేం కర్మరా బాబు' అని లోలోనే అనుకున్నాడు.

"దీనికంతటికీ కారణం ఏవిటంటారు? కారణం జనాల దురాశే బాబు! మళ్లీమళ్లీ అయోమయంగా అందర్నీ నమ్మడం మోసపోవడం మన అత్యాశ వల్లే". నూటికి నూరుపాళ్లు నిజమే చెప్తున్నాడతను.

రవీంద్ర నోరుతెరుచుకు చూస్తుండిపోయాడు. కాస్సేపటి తర్వాత "ఉండండి! అర్జంటుగా నాకు వేరేపనుంది వెళ్లాలి" అని తప్పించుకు కదలబోయాడు.

"ఒకే ఒక్క మాట వినేసి వెళ్లిపోండి బాబూ! "అభ్యర్థనగా అన్నాడతను.

"ఇప్పుడు మీరు రోజుకి వందకట్టారనుకోండి. సంవత్సరానికి ముప్ఫై ఆరువేల అయిదొందలవుతుంది. దానికి వడ్డీ కట్టారనుకోండి. సంవత్సరానికి పన్నెండు లక్షలు. దానికి ఎనిమిది లక్షలు కలిపి ఇరవై లక్షలిస్తామంటారు. అలాగే మీరు ఒక మెంబర్ని జాయిన్ చేసారనుకోండి. గోల్డ్‌కాయిన్ ఇస్తారు. పదిమందిని చేరిస్తే పదిగోల్డు కాయిన్లు".

"నాకర్జంటు పనుందని చెప్తే వినరేం?" అని అతణ్ణి దాటి పోలేక వెనుతిరిగాడు రవీంద్ర "

అరరే...నేను చెప్పేది పూర్తిగా వినరేంటి" అతను అడ్డగించాడు మళ్లీ.. చిరాగ్గా అసహనంగా అసహ్యంగా చూసాడు రవీంద్ర.

"ఆఖరికి నా కర్మిలా క్యాడా కాలింది" అనుకొని మూలిగాడు.

"చివరగా మీ మేలు కోరి చెప్తున్నాను. ఇటువంటి వాటిల్లో ఇరుక్కోకు బాబు" అని ముగించినట్టు నవ్వుతూ చూసారాయన. అతని చూపుల్లో తేడా స్పష్టంగా ఉంది.

"నాన్న! ఇంటికి పోదాంరా!" అని ఓ అమ్మాయొచ్చి చెయ్యిపట్టుకుంది. ఆ అమ్మాయి చిరిగి మాసిన బట్టల్తో వాడిన దేహంతో ఉంది. ఆ అమ్మాయి మాట విని ఆగాడు రవీంద్ర.

"ఉండు వసూ.. ఈ అబ్బాయికి ఇంకో ముఖ్య విషయం చెప్పాలి." అన్నారాయన. రవీంద్ర వైపు చూసిందామె. నిశితంగా ఆమె ముఖంలోకి చూసిన రవీంద్ర 'వసూ ...నువ్వు?అన్నాడు.

అవునన్నట్టు తలూపింది వసుమతీ. ఈసారి రవీంద్ర అతనివైపు ప్రసన్నంగా చూస్తు-మీరిప్పుడు ఇంటికి వెళ్లండి. అక్కడన్నీ చెబ్దురుగాన్లెండీ' అని, వసూ వైపు చూసి 'మీ ఇల్లెక్కడ వసూ!' అనడిగాడు రవీంద్ర.

"అదే రవీ.. ఆ ఇల్లే!" అని చెయ్యెత్తి సూటిగా చూపింది వసూ. రవీంద్ర వాళ్లీళ్లు దాటుకునే వెళ్లాల్సింది. అందుకే వసూననుసరించాడు.

వసుమతి రవీంద్ర ఆండాళ్లమ్మ కాలేజీలో డిగ్రీ క్లాస్‌మేట్స్. సెకండియర్లో చదువుకి ఎగనామం పెట్టేసింది వసుమతి. మళ్లీ ఇన్నాళ్లకిలా ఎదురైంది. రెండే రెండు నిమిషాల్లో వాళ్లింటి ముందరకి

చేరుకున్నారు. వాళ్లిల్లు అతిపురాతనమైన పెంకుటిల్లు పెంకులు కొన్ని ఊడిరాలిపోయాయి. గోడలు పెచ్చులూడాయి. సున్నంవేసి చాన్నాళ్లవడం వల్ల భూత్ బంగ్లాలా వుంది. ఇంటి ముందర దైన్యం తాండవిస్తుంది. గుమ్మం దగ్గరే నిలిచిపోయాడు. రవీంద్ర. 'రవీ ' పిలిచింది వసుమతి.

"ఇక్కడి వరకూ రానే వచ్చావు! లోపలకి రావా?" అంది మళ్లీ తనే వసుమతి. పెద్దాయన్ని స్నానానికెళ్లమని పంపించి వసుమతి కుర్చీవేసి కూర్చోమంది రవీంద్రని. కుర్చీలో కూర్చుంటూనే.. 'వసూ! మీ నాన్నకి మెంటలా?' అని సూటిగా అడిగేసాడు. రవీంద్ర. తలూపి మౌనంగా ఉండిపోయింది వసుమతి. కాస్సేపటి మౌనం తర్వాత చెప్పటం ప్రారంభించింది.

"ప్యూర్ గోల్డ్ అనే కంపెనీ పెట్టారు నీకు తెలుసా రవీ? నాన్న మునిసిపాలిటీలో ఉద్యోగం చేస్తూనే అందులో మొదట మెంబర్‌గా చేరారు. తర్వాత ఏజెంటయ్యారు. ఏజెంటుగా ఎక్కువ మెంబర్లని చేర్చినందుకు అవార్డు కూడా ఇచ్చారు. దాంతో నాన్న కష్టార్జితం ఇంట్లో ఉన్న బంగారం సొమ్ముగా మార్చి మరీ ప్యూర్ గోల్డ్ పొదుపు స్కీంలో డిపాజిట్ చేసారు. అధిక వడ్డీకి ఆశపడ్డారు. అంతలోనే రిటైర్ అయ్యారు. ఆ సొమ్ము కూడా పోతుంది కదా! అప్పుడందే ఆ సొమ్ముతో నా పెళ్లి ఘనంగా చేయొచ్చని ఆశించారు. కానీ ఈ లోగానే ఆ సంస్థ బోర్డు తిప్పేసింది. గోరుచుట్టు మీద రోకటి పోటులా అమ్మ సడెన్‌గా హార్ట్‌ఎటాక్‌తో చనిపోయింది. ఇల్లు గడిచే స్థితి లేకుండా పోయింది. నాన్న ద్వారా డిపాజిట్ చేసినోళ్లు మా ఇంటి మీదకొచ్చి గోల చెయ్యడం ప్రారంభించారు. పూటకో గొడవ, రోజుకో అల్లరి క్షణక్షణం సందిగ్ధం. అలాఅలా నాన్న స్థితి.. ఈ పరిస్థితి కొచ్చింది. నాలుగు నెలలపాటు పిచ్చాస్పత్రిలో ఉండి ఈ మధ్యనే డిశ్చార్చ్ అయ్యారు. ఇలా ఆ ప్యూర్ గోల్డ్ సంస్థ ఎందరరెందరి జీవితాల్నో బలి తీసుకుంది. ఇల్లు గడిచేందుకు నేను ఫ్యాన్సీ షాపులో సేల్స్ గర్ల్‌గా చేరాను అని ముగించింది వసుమతి. 'పాపం' అని లోలోనే అనుకున్నాడు రవీంద్ర.

రవీంద్ర జాలి గుండె కరిగి నీరైపోయింది.

"పాప పుణ్యాల ప్రసక్తి మాటకేం? ఇలాంటి వసుమతుల ఎందరెందరి జీవితాలు నాశనమయ్యాయో?

ఇప్పటికీ ఇంకా అలాంటి సంస్థలు పుట్టుకొస్తూనే ఉంటే జనం నమ్ముతూనే ఉన్నారు. ప్రభుత్వం ఇలాంటి సంస్థలపై నిఘానేత్రం ఉంచడం లేదు. కొందరు నాయకులు కొమ్ముకాయడం వల్ల అది అసాధ్యమై పళంగా జీవితాలు గల్లంతవుతున్నాయి.

సానుభూతి చెప్పడం తప్ప నేను మాత్రం ఏం చెయ్యగలను? అయినా ఒకరికొకరు సహాయం చేయగల ఆర్థిక స్థోమతేది? పాపం వసుమతి" అని ఆలోచిస్తుండిపోయాడతను.

చివరికి వస్తాను వసూ! అని లేచాడు.

అప్పుడప్పుడొస్తుండు రవీ!" అంది వసు

"అలాగే .. వస్తుంటాన్లే" అని కదిలాడు.

"బాబు! ఒక్కమా.. " అరుస్తూ వచ్చాడు వసూ నాన్న

ఆగి ఏవిటన్నట్టు చూసాడురవీంద్ర.

"బాబూ? మీరిద్దరూ స్నేహితులే కదూ? మీకు పెళ్లయిందా?"

"లేదండీ?"

'ఉద్యోగం ఎక్కడ చేస్తున్నారు?"

"హేమసాయి ట్రాన్స్‌పోర్టులో గుమాస్తాగా చేస్తున్నాను".

"బాబ్బాబూ.. దయుంచి మావసూని పెళ్లి చేసుకోండి. కట్నం ఇవ్వలేను కానీ ప్యూర్ గోల్డ్‌లో డిపాజిట్స్ అందాక అంతా మీకే ఇచ్చేస్తాను. మా వసూ బంగారం. గుణవంతురాలు. బుద్ధిమంతురాలు. "ఇంకా ఏవేవో చెప్పుకుపోతున్నారాయన. "మా అమ్మతో మాట్లాడాలండి !ఆగండి! " నిర్ఘాంతపోయిన రవీంద్ర నోరుపెగల్చి అన్నాడు.

"సరే కానీ...నాతో ఓ ముద్దెంగిలి పడండి.. రండి... " అన్నారాయాన.

వద్దన్నట్టు తలడ్డంగా ఊపింది వసుమతి. ఆ సంకేతం కొంచెం అర్థమైంది. అలాగని రవీంద్రకి పూర్తిగా అర్థం కానూలేదు.

ఏవేవో ఆలోచిస్తూ నడుస్తుంటే సెల్ రింగయింది. ఆన్ చేసి 'హలో' అన్నాడు రవీంద్ర. 'గుడ్ మార్నింగ్ సార్' ఆంగ్లంలో హస్కీగా ఉందా గొంతు.

"చెప్పండి".

"మీరు లక్కీఫెలో.. మీకు ఆస్ట్రేలియా ఐసియుసిఎ లాటరీలో పద్దెనిమిది కోట్ల లాటరీ వచ్చింది. ఇట్స్ ది సర్‌ప్రయిజ్ న్యూస్ ఫర్ యూ...

"ఆ.......అయిబాబోయ్!"

"కంగ్రాచ్యులేషన్స్"

'థాంక్యూ!' లోలోన ఏదో తేడా కొడ్తుంటే తనకి తానే తెలుసుకుంటూ పైకి మాత్రం నవ్వుతూనే అన్నాడు రవీంద్ర.

"ఇక్కడి ఫార్మాల్టీస్ కోసం మీకు మీ లాటరీ ఎమౌంట్ చెయ్యడానికి అరవైవేలు ఈ ఎకౌంట్లో జమ చెయ్యాల్సి వుంటుంది".

"అలాగ.. ఎకౌంట్ నెంబరు చెప్పండి."

ఆమె చెప్పిన నెంబరు పెన్నుతో ఎడమ చేతిమీద వ్రాసుకున్నాడుతను. రేపుదయాన్నే మీ ఎకౌంట్లో డబ్బులు వేస్తానని చెప్పి, లాటరీ ఎమౌంట్ తొందరగా పంపాలనీ మరీమరీ చెప్పాడు రవీంద్ర.

ఇంటికి చేరేసరికి గౌరిషు వరండా గదిలో పేపర్ చదువుతూ కూర్చున్నాడు గౌరిషు. రవీంద్ర అమ్మ నాంచారమ్మ– " అదిగో! రవి వచ్చాడు. ఆ రెండు సంబంధాలు గురించి చెప్పు గౌరీషూ.. అంటుంది.

"రవీ ! ఎక్కడికెళ్లావ్? ఈ పేపర్లో ఘోరం చూసావా? కొన్ని వందల రూపాయిల నోట్లు బ్యాంక్ దగ్గర కారు ముందర జల్లి అరవై లక్షల క్యాష్‌బాగ్ తస్కరించారుట. అదీ మన సెంట్రల్ బ్యాంక్ రద్దీ రోడ్డు దగ్గరే!"

"ఔనా?" అన్నాడు ముక్తసరిగా రవీంద్ర.

"నీకోసమని మంచి సంబంధాలు రెండు తెచ్చాను రవీంద్రా!"

"ఒద్దు బాబూ! ఒద్దు. నువ్వుచూసే సంబంధాలు వాళ్లకి ప్రభుత్వ ఉద్యోగం ఉండాలి. స్వంత ఇల్లుండాలి. బాగా ఆస్తులుండాలి. బైకు తప్పనిసరిగా ఉండాలి. అలాఅలా నువ్వు చూసే సంబంధాలు వాళ్లెవరూ నన్నిష్టపడటం లేదు. అందుకే నువ్వునాకు సంబంధాలు చూడొద్దు. నా తిప్పలేవో నేను పడ్తాన్లే! " అని కొట్టి పారేసాడు రవీంద్ర..

"ఇదేకాదు. మరో ముఖ్యమైన పనిమీదొచ్చాను రవీ " అని అసలు విషయానికొచ్చాడు గౌరీషు.

ప్రశ్నార్థకంగా చూసాడు రవీంద్ర.

'డబ్బు అర్జంటుగా కావాలి రవీ... బాంబు పేల్చాడు గౌరీషు.

"నా దగ్గరెక్కడిది? లేవు".

"అలా అనకు. ఎవరి దగ్గరైనా ఉంటే చూసి ఇప్పించు".

"ప్చ్.. "పెదవి విరిచి తలడ్డంగా ఊపాడు రవీంద్ర."

"యాభై వేలు సర్దారనుకో....వారం రోజుల్లో వడ్డీగా యాభైవేలు కలిపి లక్ష ఇస్తాను. ఇది తెలిస్తే లక్కీ ఛాన్సని ఎవరూ వదులుకోరు మరి.. అని మళ్లీ రెట్టించాడు గౌరీషు.

"ఏంటి యాభై వేలకి వారం రోజుల్లో యాభై వేలు వడ్డీయా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.. రవీంద్ర.

"ఇదేదో మోసంలా ఉంది గౌరీషు. .." అని మళ్లీ తనే అన్నాడు.

"ష్! ఎవ్వరికీ చెప్పకేం? నాకు ఇరవై రెండు కోట్ల లాటరీ తగిలింది. ఆస్ట్రేలియా యారోస్విస్ లాటరీ....యాభై వేలు బ్యాంకులో జమచేసామనుకో వారం రోజుల్లో ఇరవై రెండు కోట్లొచ్చేస్తాయి మరి... అని లో స్వరంలో విషయం బయటపెట్టాడు గౌరీషు.

రవి తన చేతిమీద ఎకౌంట్ నెంబరు చూసుకున్నాడు.

"ఈ నెంబరుకేనా నువ్వు డబ్బు పంపాల్సింది?" అని చెయిచాచి చూపాడు.

ఔను ఇదే నెంబరు"ఆశ్చర్యంగా చూస్తు అన్నాడు గౌరీషు.

"మోసం ఇది నైజీరియా వాళ్ల మోసం. అర్జంటుగా పోలీస్ స్టేషన్‌కి పద. క్రైం బ్రాంచ్‌కి కంప్లయింట్ ఇవ్వాలి. ....పద...పద... అని గౌరీషు భుజం తట్టాడు రవీంద్ర.

లిలిలి

"ఏవిటిలా వస్తున్నావ్? " నవ్వుతూ అడిగింది. ప్రశాంతమైన ముఖం, పెద్ద కళ్లు, తళుక్కున మెరుస్తున్న పలువరస. శోభాప్రభలా దివ్యంగా కనిపించింది వసుమతి.

"నీ కోసమే వసూ.... అప్రయత్నంగా అనేసాడు. కళ్లు రెపరెపలతో వింతగా చూసింది వసుమతి.

"నిజంగా నీ కోసమే! నువ్వొక బాధితురాలివి..... నేనూ అంతే! నువ్వు మధ్యతరగతి అమ్మాయివి. నేనూ అంతే.! నువ్వొక చిరుద్యోగివి.. నేనూ అంతే! నీది వైజాగే... నాదీ వైజాగే.. పైగా మనిద్దరం ఒకప్పటి క్లాస్‌మేట్స్‌మి."

"అసలు విషయం తప్ప.. చాలా పెద్దలిస్టే చెప్పావు".

"ఇంకా అర్థం కాలేదా?" నవ్వుతూ చూసాడు రవీంద్ర.

" ఇది నిజమేనా? కలా? " నీళ్లు నిండిన కళ్లతో వింతగా చూసింది వసు.

"ఇప్పుడే నువ్వు నాతో మా ఇంటికి రా. మా అమ్మని కలుద్దాం. విషయం వివరంగా మా అమ్మతో చెప్పి ఒప్పిద్దాం. " అని వసుమతి చెయ్యందుకున్నాడు రవీంద్ర. వసుమతి కళ్లల్లో నిండిన నీటి పడవలో ప్రయాణానికి సిద్ధపడ్డట్టు ప్రతిబింబించాడు రవీంద్ర. ఉన్నపళంగా రవీంద్ర ననుసరించింది వసుమతి.

బాధల్లో ఉన్న ఒకరికొకరు ఓదార్పునిచ్చేలా కలిసి పయనిస్తే

రవీంద్ర.. వసుమతిలా సుఖపడగలరని అభ్యుదయ భావాల్తో సూర్యుడు ఛాయల్లా ముందు ముందుకి పయనిస్తున్నారు! ✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

<u>మెయిల్ అడ్రస్:</u>

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

అక్కడ ఆడపిల్ల పుడితే ఆనందానికి అవధులు ఉండవు. చిన్న కూతురిగా పుడితే అజమాయిషీ ఆమె చేతికే. పెరిగి పెద్దయితే వరుడిని తనింటికి వెంటబెట్టుకొచ్చి కొత్త జీవితం ప్రారంభిస్తుంది. ఆస్తి, వ్యాపార లావాదేవీలన్నింటికీ ఆమె వారసురాలు. ఇంటికి యజమానురాలు. సమాజానికి పెద్ద మనిషి. మేఘాలయ మాతృ వంశాధారిత వ్యవస్థలో మహిళాసాధికారత ఇది. ఆడబిడ్డే ఆధారమైన ఖాసీ తెగల జీవనశైలి స్త్రీ విలువ గురించి ఎన్నో విషయాలు చెబుతుంది.

ఆడబిడ్డే ఆధారం

ఒంటి పేరు ఇంటి పేరులతోనే అక్కడి మాతృవంశాధారిత వ్యవస్థ ప్రత్యేకత ఆగిపోదు. అది రచ్చబండ దగ్గర అంతెత్తున ఆసీనురాలై అజమాయిషీ చేయదు. పితృస్వామ్య వ్యవస్థకు మళ్లే ఆధిపత్యాన్ని ప్రదర్శించదు. సుమారు 2000 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ వ్యవస్థ రానురాను బలపడుతూనే ఉంది గానీ బయటి ప్రపంచపు పోకడల దెబ్బకు కునారిల్లడం లేదు. ప్రపంచీకరణ వల్ల కొత్త పోకడలు దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నా ఇక్కడి ఖాసీ మహిళల ఉక్కు అస్తిత్వం ముందు వాటి ప్రభావాలు ఇంకా బలపడలేదు. తల్లి వంశం కింద సాగే ఇక్కడి కుటుంబ వ్యవస్థను కుర్ అంటారు. చిన్న కూతురిని ఖట్‌దూహ్ అని పిలుస్తారు. అంటే ఓ రకంగా ఇంటి పెద్ద అన్నమాట. ఇలా ఎందుకంటే వీరే మిగతా కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుంది. ఇంటికి సంబంధించిన విషయాల్ని చక్కదిద్దేందుకు ఎక్కువ శక్తి, సామర్థ్యాలు ఉంటాయి. తల్లి నుంచి కూతురికి ఆస్తులు, వ్యాపారాలు బదలాయింపు అవుతాయి. ఒంటరి తల్లులకు ఇక్కడ ఆదరణ, విలువ తగ్గదు. మరో గొప్ప విషయం ఇక్కడ వరకట్నాలు, కన్యాశుల్కాల మాట వినిపించదు. మిగతా దేశంలోని ప్రాంతాల కన్నా ఇక్కడి మహిళలు స్వేచ్ఛాజీవులు, లింగ వివక్ష లేని వారు కావడంతో వీరి జీవితాలు చాలా మెరుగ్గా ఉంటాయి. విద్యా, వాణిజ్య రంగాల్లో చోటు చేసుకుంటున్న మార్పుల్ని వీరు ఇముడ్చుకుని కొత్త రకపు సమాజ వ్యవస్థకు రూపుదిద్దుతున్నారు. వలసల వల్ల ఇతర ప్రాంతాల్లోని పురుషాధిక్య సమాజ పోకడలు వీళ్లను ఆశ్చర్యంలోకి నెడతాయి. కొందరు వాటిని జీర్ణించుకున్నా తమ సొంతూళ్లకు తీసుకుపోరు. ఎక్కువగా పైచదువులు, ఉన్నతోద్యోగాల కోసం వెళ్లే యువతులు వీటి ప్రభావంలో పడుతున్నారు. ఈ విషయం గురించే స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మిశ్రమ వ్యవస్థను వీరు ముందుకు తీసుకెళ్లలేరేమోననే సందేహాలున్నాయి. దానికి తగ్గట్టు కట్టుబాట్లు మారుస్తున్నారు. ఖాసీలు ఇతర వర్గాలు, ప్రాంతాల వారితో వివాహ సంబంధాలకు మొగ్గు చూపకపోవడానికి కారణమిదే. ఇక్కడి స్త్రీలకు వివాహ విషయంలో చాలా స్వేచ్ఛ ఉంటుంది. ఏదైనా సమస్యకు పరిష్కారం లేకుంటే ఇట్టే వివాహ బంధం నుంచి బయట పడొచ్చు. అందుకే విడాకుల రేటు ఎక్కువగా ఉంటుంది. ఒక మహిళకు రెండు, మూడు పెళ్లిళ్లనేవి పెద్ద తప్పేం కాదన్నట్టు సమాజ తీరు ఉంటుంది.

సరికొత్త వ్యవస్థ దిశగా..

స్త్రీ శక్తికి ప్రతీకగా కొలిచే కా బ్లీ సైన్‌షార్ దేవత పేరిట వ్యవసాయ పండుగలు చేసుకుంటారు. ఆ సందర్భంగా నిర్వహించే నాంగ్‌క్రెమ్ నృత్యోత్సవాలు ఎంతో వైవిధ్యభరితంగా ఉంటాయి. ఎంత లేదన్నా ఇక్కడ లింగ వివక్ష పురుషుల విషయంలో కనిపిస్తుంటుంది. వాళ్లు పితృస్వామ్య వ్యవస్థను కోరుకోవడం లేదు కానీ పితృ వంశపారంపర్యం గురించి ఆలోచిస్తుంటారు. ఇది ఖాసీ పురుషుల బాధ్యతల్ని ఇనుమడింపజేస్తుందని అంటారు. మిగతా ప్రపంచంలో పితృస్వామ్య వ్యవస్థ మూలాలు ఎలా కదిలిపోతున్నాయో ఖాసీలోను అలాంటి మార్పులకు అవకాశం ఉందని సామాజికవేత్తలు అంటున్నారు. ఎందుకంటే తల్లి ఇంటి నుంచి, భార్య ఇంటి నుంచి లేదా సోదరి ఇంటి నుంచి మగవారు గెంటి వేయబడటం అక్కడక్కడ జరుగుతూనే ఉంటాయి. బిడ్డల విషయంలోను పురుషుడి పాత్ర తక్కువే. కొన్ని సందర్భాల్లో ఇద్దరు ముగ్గురు పురుషులకు చెందిన బిడ్డలకు ఒకే తల్లి ఉంటుంది. వారిపై హక్కులు, అధికారాలు ఆమెకు మాత్రమే పరిమితమైన విషయం. 1990 నుంచి సింగ్‌ఖాంగ్ రింపే థైమ్మాయి (ఓ కొత్త హృదయం) అనే ఉద్యమం నడుస్తోంది. పురుషుల హక్కులు, అధికారాల కోసం నడుపుతున్న బహుశా దేశంలో ఒకే ఒక ఉద్యమమేమో. మగవారిని కూడా స్త్రీల స్థాయికి చేర్చాలనే ఉద్దేశంతో దీన్ని నడుపుతున్నారు. పనికి వచ్చే ప్రతి విషయానికి నామవాచకాలు స్త్రీ లింగంలో ఉంటాయట. ఖాసీ ఉపజాతుల్లోని వార్ అనే తెగలో మాత్రం ఆస్తిని అందరు పిల్లలకు సమానంగా పంచుతారు. అలాంటి మార్పులు రావాలని ఉద్యమకారులు కోరుకుంటున్నారు. అయితే అక్కడ మరో వాదన కూడా ఉంది. చూడటానికి మాతృస్వామ్య వ్యవస్థలా కనిపిస్తుంది కానీ పంచాయతీ విషయాల్లో, కుటుంబ విషయాల్లో తుది నిర్ణయం పురుషుడికే ఇచ్చి లింగ వివక్ష ప్రభావం లేకుండా జాగ్రత్త పడుతున్నారని అంటారు. అక్కడి రచ్చబండను దొర్బార్‌గా పిలుస్తారు. దాని అధినేతను రాంగ్‌బాహ్ ష్నాంగ్ అంటారు. పెద్దాయననే అర్థం వస్తుంది. ఇలా పురుషులకు మర్యాద ఇస్తూనే తమ మాతృవంశాధారిత వ్యవస్థను కట్టుదిట్టం చేసుకుంటూ కొత్త వ్యవస్థ దిశగా అడుగులు వేస్తోంది ఖాసీ స్త్రీ సమాజం.

- అనన్య

కాలం గీటురాయి మీద నిలిచిన కథలు

మానవ జీవితంలోని బహుముఖ పార్శ్వాలను తడిమే కథలు పరాగభూమి కథలు. రచయిత 'కలువకొలను సదానందగారు' ఈ తరం వారికి ఈ పేరు తెలీదు. మానవ సంబంధాలు మరుగున పడిపోవడం, స్వార్థ ప్రవృత్తి పెరిగిపోవడం ఈ సంపుటిలోని ఇరవై కథల ఇతివృత్తాలు. వీటిలో 'యజమానురాలు' కథ ఈనాటి స్త్రీవాద కథకు ఉదాహరణగా చెప్పవచ్చు. భర్త సీతాపతి పరస్త్రీ వ్యామోహంలో పడబోతున్నపుడు భార్య రుక్కు గట్టిగా బుద్ధి చెప్తుంది. భర్తపై హక్కును కాపాడుకుంటుంది. ఈ నాడు చదువుకుని ఉద్యోగం చేస్తున్న ఆధునిక యువతులు గూడా సంఘానికి భయపడి భర్తలు తిరుగుబోతులైనా, తాగుబోతులైనా సర్దుకుపోతూవుంటారు. కానీ ఎదిరించడానికి ప్రయత్నించరు. పల్లెటూరి అమ్మాయైన రుక్కు సాహసం చేసి ఎదురు తిరుగుతుంది. చిన్నప్పుడు పిల్లల్ని ప్రాణప్రదంగా పెంచుతుంది తల్లి. పెరిగి పెద్దయినా వాళ్ల మీద అదే ప్రేమాభిమానాలుంటాయి. కానీ పిల్లలకు మాత్రం తల్లి మీద ఆపేక్ష వుండదు. ముఖ్యంగా మగపిల్లలు పెళ్లయ్యాక మారిపోతారు. 'హాయమ్మ హాయీ ఆపదలు కాయి'లో మంగతాయారు కన్నయ్య తల్లీకొడుకులు. చిన్నప్పుడే భర్తపోతే పిల్లల్ని పెంచి పెళ్లి చేస్తుంది తాయారు. పెళ్లలయిన వెంటనే అత్తాకోడళ్లకి పడక తల్లి

పుస్తకం: పరాగభూమి కథలు
రచయిత: కలువకొలను సదానంద
పేజీలు:220, **వెల:**150/-
ప్రతులకు: పలమనేరు మిత్రసాహితి, 6-219, గుడియాత్తం రోడ్డు పలమనేరు-517408
సెల్:9440995010

బయటకు వచ్చేస్తుంది. 80 ఏళ్లు వచ్చినా భార్య మరణించిన కొడుక్కి సేవలు చేస్తుంది. రోగంతో కొడుకు చచ్చిపోతే గుండెలు బాదుకొని ఏడుస్తుంది. కరుణ రసాత్మకమైన ఈ కథ గుండెను కదిలిస్తుంది. 'పరాగ భూమి' మరో తల్లీకొడుకుల కథ. చిన్నపుడే తల్లి నుండి దూరమైన రాముడు చివరకు తల్లిని కలుసుకొని ఆనందించిన కథ. 'త్రివర్ణ స్వప్నం'లో నెల చివర్లో ఉద్యోగ విరమణ చేయబోయే ముసలి మాస్టారు గురు మూర్తి కథా నాయకుడు. బళ్లో అతని ఆధ్వర్యంలో జరగబోయే చివరి స్వాతంత్ర్య దినోత్సవం. మర్నాడు ఎగుర వేయబోయే జెండా గుడ్డ మాయమైపోతుంది. రేపెలా జెండా ఎగరెయ్యాలి అని బెంగపెట్టు కుంటాడు. మర్నాడు ఒక విద్యార్థి వచ్చి జెండా గుడ్డను ఇవ్వడంతో కథ సుఖాంతమౌతుంది. 'కర్మవీరుడు' కథలో కోటయ్య ముసలి వాడు. వాళ్ల ఇంటి ఎదురుగా వున్న బళ్లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. జీతం తక్కువ. ఒకసారి కాలు విరుగుతుంది. ఇంట్లో వాళ్లు ఉద్యోగం మానెయ్యమంటారు. కానీ మానుడు కాలు తగ్గిందాకా సెలవుపెట్టి బాగైన వెంటనే ఉద్యోగంలో చేరిపోతాడు. ఈ కథ చదువుతుంటే ఈ నాడు లక్షల్లో జీతాలు తీసుకొంటూ అవిచాలక లంచాలు తీసుకొంటున్న కొంతమంది అవినీతి పరులైన ప్రభుత్వోద్యోగులు గుర్తుకువస్తారు.'వానవచ్చిన రాత్రి' ఇల్లంతా వానతో తడిసిపోతే వలపు వర్షాల్లో తడిసి ముద్దైన శశిరేఖ, సుధాకరాల కథ. 'తొయ్యిలి కట్టిన తొలి చీర' బావా మరదళ్ల ప్రేమ కథ. 'ఊత' కథలో పాతికేళ్లు దాటిన రైతుబిడ్డ శ్రీను వయోజనుల బడికి వెళ్లి మడక అని మొదటి మాట నేర్చుకొని సంబరపడతాడు. బ్రతుకు పోరాటంలో అలసిపోయిన వాళ్లు, బడుగు జీవులు రైతులు మధ్యతరగతి ప్రజలు, ఆశలు నెరవేరని ఆడవాళ్లు ఈ కథల్లో నాయకులు. ఐదు దశాబ్దాల కిందట రాసిన కథలైనప్పటికీ ఈ తరంవారు కూడా చదవదగిన వన్నె తగ్గని కథలివి. సరళమైన శైలిలో సూటిగా గుండెల్లో నాటుకొంటాయి ఈ పల్లెటూరి పరిమళం నిండిన కథలు. అచ్చమైన తెలుగుదనం విరబూసిన కథలు గుండెల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే కథలు.

- మందరపు హైమావతి

సమాజ సమస్యలే శిథిలస్వరాలు

సామాజిక సమస్యలను సృజించని కవిత్వానికి ఆదరణ ఉండదు. ఊహాప్రపంచంలో విహరించే కవితలకు కాలం చెల్లిపోయింది. ఇప్పుడు వస్తున్న కవితాసంపుటాల్లో సమకాలీన అంశాలే అధికంగా కన్పిస్తుంటాయి. అటువంటి కవితా సంపుటే "శిథిలస్వరాలు". కవి ఉండవిల్లి.ఎమ్. మొత్తం 46 కవితలు ఉన్న ఈ సంపుటిలో ఎనిమిది మాత్రమే ఇటీవలికాలంలో రాసినవి. మిగిలినవన్నీ 1990వ దశకానికి చెందినవే. చాలావరకూ మినీ కవితలు ఇందులో ఉన్నాయి. ఎక్కువ శాతం కవితలు పాతవైనా మళ్లీ మళ్లీ చదివిస్తాయి. ఈ సంపుటికి కొత్త కవితలతో కలిపి ఇది రెండో ముద్రణ. తొలి ఎడిషన్‌ను 1995లోనే కవితా సంపుటిగా

శిథిలస్వరాలు (కవితాసంపుటి)
రచన: ఉండవిల్లి.ఎమ్.
పేజీలు: 80, **ధర:** 60/-.
ప్రతులకు: ఉండవిల్లి.ఎమ్.
ఇంటినంబర్: 23-7-20, ప్లాట్ నెం. 305, శ్రీ భాను అపార్ట్‌మెంట్స్, దుగ్గిరాలవారి వీధి, కాకినాడ- 533 001

పాఠకులకు అందించారు. ఈ సంపుటి తొలిఎడిషన్‌కు ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు రాసిన ముందుమాటను ఈ పుస్తకంలో కూడా చదువుకోవచ్చు. ఈ కవితలన్నింటిలోనూ వాస్తవికమైన భావాలు పాఠకులను ముగ్ధులను చేస్తాయి. ఉదాత్తమైన సామాజిక ఆశయంతోనే ఉండవిల్లి ఈ కవితలను రాశారని స్పష్టమౌతుంది. ప్రగతిశీల భావజాలంతో అందరికీ అర్థమయ్యేలా మంచి కవిత్వాన్ని అందించిన కవి అభినందనీయులు. ఈ కవితా సంపుటి చివరి అట్టమీద 'నేల విడిచిన అక్షరం' శీర్షికతో అద్దేపల్లి రామమోహనరావు గురించి రాసిన స్మృతికవిత చాలా బాగుంది. అయితే ఈ సంపుటిలో విషయసూచిక లేకపోవడం పెద్ద లోటే. కేవలం ఈ చిరుసంపుటితో ఆగిపోకుండా ఉండవిల్లి.ఎమ్. కలం నుంచి మరిన్ని మంచి కవితా సంకలనాలు సాహిత్యాభిమానులను అలరించాలని కోరుకుందాం.

- సమత

మటన్ మసాలా గ్రేవీ

కావాల్సిన పదార్థాలు

మటన్–1/2 కెజి
బటర్– 1/2 కప్పు
గరం మసాలా–1టీ స్పూను
కొత్తిమీర తరుగు– 4 టేబుల్ స్పూన్లు
కారం–1టేబుల్ స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్ట్–1 టీ స్పూన్
మిరియాల పొడి–1టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి తరుగు–2 టేబుల్ స్పూన్లు
ఉల్లితరుగు–1కప్పు
నిమ్మరసం–1టీ స్పూన్
నూనె–సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా మటన్‌ని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. మిక్సీ జార్‌లో గరం మసాలా, ధనియాల పొడి, కారం, మిరియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. స్టౌపై ప్యాన్ పెట్టి వేడెక్కిన తర్వాత బటర్ వేసి కరిగిన తర్వాత అందులో ఉల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించుకోవాలి. అందులో మటన్ ముక్కలు కూడా వేసి ఫ్రై చేసుకోవాలి. తర్వాత మసాలా వేసి మొత్తం మిశ్రమాన్ని కలుపుతూ ఫ్రై చేసుకోవాలి. అందులో ఉప్పు, మిగిలి పదార్థాలు, సరిపడా నీరు పోసి కలుపుతూ గ్రేవీ చిక్కపడే వరకూ ఉడికించుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో వేసి ప్రెజర్ కుక్కర్‌లో ఉంచి 5 విజిల్స్ వచ్చే వరకు ఉడికించుకోవాలి. తర్వాత స్టౌ ఆపేసి కుక్కర్ చల్లారాక సర్వింగ్ బౌల్‌లోకి గ్రేవీని మార్చుకుని వేడి వేడిగా సర్వ్ చేయాలి.



గ్రీన్ మసాలా ఫిష్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు

గ్రీన్ మసాలా కోసం

పచ్చిమిర్చి–5
కొత్తిమీర తరుగు–3 టేబుల్ స్పూన్లు
పుదీనా –కొద్దిగా
కరివేపాకు–4 రెబ్బలు

మసాలా కోసం

పసుపు–1/4 టీస్పూన్
గరం మసాలా పొడి–1టేబుల్ స్పూన్
ధనియాల పొడి–1టేబుల్‌స్పూన్
కారం–1టేబుల్ స్పూన్
జీలకర్ర పొడి–1/2టీ స్పూన్
మిరియాల పొడి–1/2 టేబుల్ స్పూన్
ఆలివ్ నూనె–2 టేబుల్ స్పూన్లు
నూనె–ఫ్రై చేయడానికి సరిపడా
మొక్కజొన్న పిండి–2 టేబుల్ స్పూన్లు
బియ్యప్పిండి–2 టేబుల్ స్పూన్లు
ఉప్పు–సరిపడా
అల్లం వెల్లుల్లి పేస్ట్– 1టీ స్పూన్
నిమ్మరసం–కొద్దిగా

తయారుచేసే విధానం

ముందుగా గ్రీన్ మసాలా కోసం సిద్ధం చేసుకున్న పదార్థాలన్నీ మిక్సీ జార్‌లో వేసి బ్లెండ్ చేసుకోవాలి. చేపముక్కలకు ఉప్పు, పసుపు పట్టించి శుభ్రంగా కడిగి నీరు పూర్తిగా వంపేసి పక్కనపెట్టుకోవాలి. ఇప్పుడు ఒక వెడల్పాటి బౌల్ తీసుకొని అందులో చేప ముక్కలు గ్రీన్ పేస్ట్ వేసి బాగా కలుపుకోవాలి. తర్వాత పసుపు, గరం మసాలా, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, మిరియాల పొడి, ఆలివ్ నూనె కూడా వేసి మరోసారి కలపాలి. చివరగా మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, వేసి మొత్తం మిశ్రమం కలిసేలా మరోసారి బాగా కలిపి పక్కన పెట్టు కోవాలి. గంట తర్వాత స్టౌపై ప్యాన్ పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె వేసి కాగిన తర్వాత ఒక్కో చేప ముక్కను వేసి ఫ్రై చేసుకోవాలి. బంగారు రంగు వచ్చే వరకు రెండు వైపులా డీప్ ఫ్రై చేస్తే గ్రీన్ మసాలా ఫిష్ ఫ్రై రెడీ.

ఆనియన్ చికెన్ గ్రేవీ

కావాల్సిన పదార్థాలు

చికెన్ –1/2 కెజి
ఉల్లిపాయల తరుగు–2 కప్పులు
టమాటా తరుగు–1 కప్పు
అల్లం వెల్లుల్లి పేస్ట్–1 టీ స్పూన్
పచ్చిమిర్చి–6
పెరుగు–1 కప్పు
కారం–1/2 టీ స్పూన్
నూనె– తగినంత
ఉప్పు–రుచికి సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా ప్యాన్ తీసుకొని అందులో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడెక్కిన తర్వాత ఉల్లి తరుగు వేసి వేయించుకోవాలి. అందులో టమాటా ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించుకోవాలి. టమాటా ముక్కలు మెత్తబడే వరకూ వేయించి పక్కన పెట్టుకోవాలి. మరో ప్యాన్‌లో నూనె వేసి వేడెక్కిన తర్వాత చికెన్‌ని వేయించుకోవాలి. మరో ప్యాన్‌లో పోపు వేసి వేగిన తర్వాత వేయిస్తున్న చికెన్ ప్యాన్‌లో వేసి మొత్తం మిశ్రమాన్ని కలిపి ఫ్రై చేసుకోవాలి. ఇప్పుడు అందులో పెరుగు, కారం వేసి మరోసారి కలపాలి. మొత్తం మిశ్రమం చిక్కగా మారే వరకు ఉడికించి ఒక బౌల్‌లోకి తీసి సర్వ్ చేయండి.



రంగులు అద్దండి



భిన్నమైనదేది

ఇక్కడ మూడు వరుసల్లో కొన్ని బొమ్మలనుంచాం. ఒక్కో వరుసలో ఒక భిన్నమైన బొమ్మ వుంది. అదెక్కడుందో కనిపెట్టి సున్నా చుట్టేయండి.

అతికిద్దాం



చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. తేనెటీగ బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.

నీడతో బొమ్మ

పిల్లలూ మీకు నీడ బొమ్మంటే భలే ఇష్టం కదూ! టోపీ పెట్టుకున్న ఒక వ్యక్తి ముఖాన్ని చేతి వేళ్లతో ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం. చీకటి గదిలో చిన్న వెలుగులో మీరూ ప్రయత్నించండి.



కనిపెట్టండి

ఇక్కడ కొన్ని బొమ్మలు వాటి మధ్య కొన్ని బాక్సులు వున్నాయి. బొమ్మలపై ఇచ్చిన నెంబర్ల ఆధారంగా వాటి పేర్లను సరైన బాక్సుల్లో రాసేయండి.

ఏ నీడ ఎవరిది?

పిల్లలూ! ఇక్కడ కొన్ని వస్తువులు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ వస్తువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి



పిట్ట కొంచెం తోక ఘనం

పిల్లలూ! మీరు చాలా రకాల పక్షుల గురించి తెలుసుకుంటుంటారు కదా. మరి లాంగ్‌టెయిల్డ్ విడోబర్డ్ గురించి మీరెప్పుడైనా విన్నారా?

- ఇవి ఆఫ్రికా ఖండంలోని అంగోలా, బోట్స్వాన, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, కెన్యా, దక్షిణ ఆఫ్రికా, జాంబియా, జైరీ దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- అన్ని పక్షుల మాదిరిగా ఇవి మీడియం సైజులోనే వున్నా పొడవాటి తోక వీటి ప్రత్యేక ఆకర్షణ.
- మగ పక్షుల శరీర భాగం పూర్తిగా నలుపు రంగులో ఉండి, భుజాల వద్ద కొంత తెలుపు రంగుని, రెక్కలు కాషాయ రంగుని కలిగుంటాయి.
- ఇవి ఎక్కువగా గింజలు, చిన్న చిన్న కీటకాల్ని ఆహారంగా తీసుకుంటాయి.
- మగపక్షుల తోక భాగంలో ఉండే రెక్కల్లో 6 నుండి 8 రెక్కలు అరమీటరు పొడవుంటాయి.
- ఇవి సాధారణంగా పచ్చని చెట్లు, పచ్చిక మైదానాల్లో కనిపించినా దక్షిణ ఆఫ్రికాలోని డార్కెన్స్ బర్గ్ ప్రాంతంలో 2750 మీ ఎత్తైన కొండలపై నివసిస్తాయి.
- పొడవాటి తోక ఆధారంగా గుబురుగా ఉండే పచ్చిక బైళ్లలోనూ మగ విడొబర్డ్‌లని ఆడపక్షులు ఎంతో దూరం నుండి కూడా తేలికగా గుర్తించేస్తుంటాయి.
- పొడవైన తోకే కాదు మగ పక్షుల వెడల్పాటి రెక్కలూ ప్రత్యేకంగా ఉంటాయి. వీటి ద్వారా ఆడపక్షుల్ని ఆకర్షిస్తుంటాయి.



- ఇవి ఎగిరే సమయంలో 147 మి.మీ వెడల్పున రెక్కల్ని చాపుతాయి.
- పొడవైన తోక కారణంగా వాతవరణం తేమగా ఉన్నపుడు ఇవి ఎగరలేవు.
- ఆడపక్షులు ఎక్కువగా ఎగరడానికి ఇష్టపడవు.
- నివాసాలని ఏర్పరచడంలో పూర్తి బాధ్యత ఆడపక్షులదే.
- పచ్చిక బైళ్లలో లభించే గడ్డి, ఊలు, తీగెలతో డోమ్ ఆకారంలో ఒక మీటరు పొడవున ఇవి నివాసాలని ఏర్పరుచుకుంటాయి.
- ఫిబ్రవరి–జులై మధ్య రెండు నుండి మూడు గుడ్లని పొదుగుతాయి.

పదవికాసం - 35

కూర్పు: రావెళ్ళ

ఆధారాలు

అడ్డం

1. పరమాన్నం(3)
3. 'జీన్స్' చిత్రకథానాయిక(5)
6. మణి (2)
7. పవిత్రం(3)
9. 'అవును'వ్యతిరేకం(2)
10. త్రాచుపాములోని ఆద్యంతాలు(2)
11. పదికాయలులో 2,4 అక్షరాలు(2)
13. కొన్ని...కలిస్తే వాక్యం.. కుడి నుండి(3)
14. ఇంగ్లీష్ కన్ను (1)
15. శోభన, యయాతి,గయుడు పదాల్లోని తొలి అక్షరాలు(3)
17. యధావిధిగా సంధ్య (2)
19. హృదయం(2)
20. ఒక సత్యాగ్రహం (2)
21. విందుకు రండిలో గౌరవం మాయం (2)
23. నాపరాయిలో రాయిపగిలిపోయింది (2)
26. బంగారం,ఆకాశమూ అనే అర్థం వచ్చే పువ్వు(5)
27. తిలకంలో తీగ (3)

1		2		3		4		5
6			7		8		9	
		10			11	12		
13				14		15		16
		17	18		19			
20			21	22			23	
		24				25		
26						27		

నిలువు

1. పాదాలను రక్షించేవి (5)
2. అంకెలు కలిస్తే(2)
3. పంచవ(3)
4. అంతర్యామిలో చివరి సగం(2)
5. ఒక అరబ్ దేశం శీర్షాసనం వేసింది (3)
7. సర్పం(2)
8. ... విగ్రహంలా అలా చూస్తుండిపోతారేంటి (2)
10. తాపం కలిగించడం (3)
12. శ్రీకృష్ణుడి పెంపుడు తల్లి(3)
16. గడ్డిమోపులో ఒక పరక(5)
18. సాత్పుర పర్వతాల తొలివి తలకిందులగా (2)
19. ఎర్నాకులంలో1,3 అక్షరాలు (2)
20. దుడ్డుకర్ర (3)
22. గాలి.. దుమ్ము కలిస్తేవచ్చేది (3)
24. నివాసము (2)
25. రెండు పక్షాలు కలిస్తే (2)

సుడోకు

3	2	8	5	4				7
		5	3	1	6		8	
		1					4	5
		6			2	4		3
	3						1	
5		4	7			9		
8	4					5		
	6		1	2	5	8		
1				8	7	6	9	2

గతవారం జవాబులు

6	8	9	7	3	5	1	2	4
2	1	3	8	9	4	5	6	7
5	7	4	6	2	1	8	9	3
7	3	6	9	4	8	2	1	5
8	2	5	3	1	6	4	7	9
9	4	1	5	7	2	3	8	6
1	6	8	4	5	7	9	3	2
3	5	7	2	8	9	6	4	1
4	9	2	1	6	3	7	5	8

1 అ		2 ము	3 ని		4 ప	రి		5 క్రో
6 క్షి	7 ప		ల		ద		8 పూ	ట
	9 బ	10 లీ	యం		11 తి	12 ల	కం	
13 ప్ర		ల		14 క		వం		15 వం
16 గ	ధ		17 సు	న్న	ము		18 తుం	గ
తి		19 స్వ		ము		20 ము		దం
	21 అ	ర్ణ	22 వం		23 స	ర	24 సం	
25 చె	ట్టు		ద		ర		26 ది	27 స
ల్లి		28 తా	నం		29 యు	క్తి		బ

మనసూరిస్తూ...!



అన్నం ముద్దకు అందం అద్ది తినిపిస్తుంది మొజాయిక్ సూషి. వంటకాల్ని ముచ్చటగా తీర్చిదిద్దే కళ ఎప్పటి నుంచో ఉంది. అది ఈ మధ్య మొజాయిక్ సూషి పేరుతో జపాన్‌లోని ఇంటింటికి వడ్డించేస్తోంది. అన్నం ముద్దల్ని క్యూబ్‌లుగా చేసి లేదా చుట్ట చుట్టి మిగతా వంటకాలతో జత చేసి చక్కటి జామెట్రీలో కనిపించేలా పేర్చితే ఈ కళలో ఘుమఘుమాయిస్తున్నట్టే. రుచిలో, సువాసనలోనే కాకుండా కనులకు ఫ్లేవర్ కనిపించే ఈ అందాల విందును చూస్తే మనసూరిపోతోంది కదూ.

విస్మయంలోకి అడుగు







ఇది భూమ్మీది గుహే. కుజ గ్రహం మీది ఒకప్పటి ప్రకృతి దృశ్యమో, హాలీవుడ్ సీజీ మాయాజాలమో కాదు. సూపర్‌మేన్ చిత్రంలోని స్ఫటిక గుహలా తోచే దీన్ని ప్రకృతే మలిచింది. ఆరు కోట్ల ఏళ్ల క్రితమే ఇప్పటి స్కాట్లాండ్‌కు చెందిన హెబ్రైడ్స్ సముద్ర ప్రాంతంలో లావా పొంగి ఓ ద్వీపమైంది. స్టాఫాగా పిలుస్తున్న ఆ ద్వీపంలో తర్వాత రాళ్లు సర్దుబాటు జరిగి కెరటాల తాకిడికి ఓ అందమైన గుహ ఏర్పడింది. లావా చల్లబడి బసాల్ట్ శిలలు షడ్భుజి ఆకారాల్ని సంతరించుకుని విస్మయకరమైన గుహగా మార్చేశాయి. ఎవరో చెక్కినట్టు అంతెత్తున కనిపించే ఈ గుహను చూసి భయపడినవాళ్లున్నారు, విస్తుపోయినవాళ్లున్నారు. అలా వాళ్లు పౌరాణిక గాథల్ని దానికి అల్లేశారు. మాయా గుహగా అది మరింత ప్రచారంలోకి రావడానికి కారణం సముద్ర అలల తాకిడిని ప్రతిధ్వనిస్తూ ఓ రకమైన సంగీతాన్ని సృష్టిస్తాయి దాని శిలలు. (వుయైమ్ భిన్) మెలోడియస్ కేవ్‌గా ఐర్లాండ్‌కు చెందిన గాలిక్ జానపదాల్లో చేరింది. మనిషికి పరిచయమైనప్పటి నుంచి ఈ గుహ ప్రఖ్యాత కవులు, చిత్రకారుల కళా వస్తువైంది. వారి సృజనల్లో మరింత అద్భుతంగా వాసికెక్కింది. అలా ఓ పద్య సాహిత్యంలోని సూపర్ హీరో పాత్ర మీదుగా ఫింగల్‌గా పేరు పెట్టారు. దాని ప్రతి ధ్వనులను ప్రఖ్యాత జర్మన్ సంగీతకారుడు ఫెలిక్స్ మెండెల్‌సన్ 'ది హెబ్రైడ్స్' / 'ది ఫింగల్స్ కేవ్' పేరిట స్వరపరిచాడు. 66 అడుగుల ఎత్తు, 40 అడుగుల వెడల్పు, సుమారు 230 అడుగుల పొడవుతో ఉంటుంది. లోపలికి ప్రవేశించే సముద్ర నీరు లోతు 25 అడుగులకు తగ్గకుండా ఉంటుంది. ఈ గుహలోకి అడుగు పెడితే బసాల్ట్ శిలల వైచిత్రిలో నిశ్చేష్టులవుతారు.



Check List

Book Number	KNSR02B142	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29